


SHIVA SURYA TELUGU DAILY
# శివసూర్య
RNI APTEL : 2023/88704
తెలుగు దిన పత్రిక

శివసూర్య
విలేకర్లు కావలెను
కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార దినపత్రిక శివసూర్య తెలుగు దినపత్రికలో పని చేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జ్‌లు & మండల విలేకర్లు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్: బి. శివరాముడు
9494741301, 9346185399.

కర్నూలు సంపుటి : 04, సంచిక : 21 ఛీఫ్ ఎడిటర్.. పేజీలు : 08, వెల రూ. 2రూ/ గురువారం - 01 - అక్టోబర్ - 2026
Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

## కిటకిటలాడుతున్న తిరుమల గిరులు.. సర్వదర్శనానికి పోటెత్తిన భక్తులు..



తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
సర్వదర్శనానికి 24 గంటల సమయం
వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిండి బయటకు చేరిన క్యూలైన్లు
మంగళవారం శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.22 కోట్లు

తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది.

## డెల్టా సీఈవోపై మస్క్ ఫైర్.. మీ ఉద్యోగం ఊడుతుంది జాగ్రత్త అంటూ వార్నింగ్!



స్టార్‌లింక్‌ను తిరస్కరించిన డెల్టా ఎయిర్‌లైన్స్‌పై మండిపడ్డ మస్క్
మస్క్ ప్రతిష్టపై సీఈవో ఎడ్ బాస్టియన్ చేసిన వ్యాఖ్యలతో రాజుకున్న వివాదం
ఈ నిర్ణయం వల్ల మీ ఉద్యోగం పోవడం ఖాయమంటూ సీఈవోకు మస్క్ వార్నింగ్
స్టార్‌లింక్‌ను కాదని అమెజాన్ 'లియో' వైపు కోసం డెల్టా ఒప్పందం

కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ...

# మల్లు భట్టి కీలక వ్యాఖ్యలు!

- జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి
- కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలని పిలుపు
- సీఎం రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ
- నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య



హైదరాబాద్: వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలు న్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. మిగతా 2 లో

## మహిళల కోసం భవిష్యత్తులో
# ఏసీ బస్సులు కొంటాం

"డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది

- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం
- 26,401 మందికి ఇళ్ల పట్టాలు అందిస్తున్నాం
- గత వైకాపా పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం
- గత ప్రభుత్వం భూ సర్వే పేరుతో ప్రతి ఊరిలో వివాదాలు సృష్టించింది



విజయవాడ: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. 26,401 మందికి ఇళ్ల పట్టాలు అందిస్తున్నాం. మిగతా 2 లో



ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలు..
## సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

అక్టోబర్ 11 నుంచి 20 వరకు ఉత్సవాలు
క్యాంపు కార్యాలయంలో ఆహ్వానపత్రిక అందజేత
సీఎంకు అమ్మవారి ప్రసాదం, వేదాశీర్వచనం
ఉత్సవాల ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్న సీఎం



## నా ఆస్తులు రూ.1,400 కోట్లు, అన్నీ చట్టబద్ధమే: డీకే శివకుమార్

కేంద్ర మంత్రి కుమారస్వామికి డీకే కౌంటర్
నిరాశతో తనపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శ
సీఎంగా ఉన్నప్పుడు వైన్ ప్రాజెక్టుపై మౌనంగా ఎందుకున్నారని ప్రశ్న
ఎలాంటి దర్యాప్తుకైనా తాను సిద్ధమని స్పష్టీకరణ
బెదిరింపులకు, బ్లాక్‌మెయిళ్లకు భయపడనని తేల్చిచెప్పిన శివకుమార్

# దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ అగ్ర స్థానంలో ఉంది

- ఐగాట్ కర్మ యోగి ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇప్పించాం
- ఉద్యోగులకు ఐఐటీ, ఐఐఎంలతో నైపుణ్య శిక్షణ
- తాగునీటి సమస్యపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిరంతర ప్రక్రియగా ఉండాలి



అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిరంతర ప్రక్రియగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖలు అందించే సేవలపై ఉన్నతాధికారులతో మిగతా 2 లో

రబీ సీజన్ కు పంటల మద్దతు ధర
## పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం

ఢిల్లీలో స్మార్ట్ ట్రాఫిక్‌కు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్

రూ.1,789.52 కోట్ల అంచనా వ్యయంతో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుకు ఆమోదం
ఢిల్లీలోని 42 ప్రధాన ట్రాఫిక్ కారిడార్లను మూడు దశల్లో 24 నెలల్లో ఈ వ్యవస్థ పరిధిలోకి తీసుకురానున్నారు
అంబులెన్సులు, అత్యవసర వాహనాలకు గ్రీన్ కారిడార్ సౌకర్యం
కీలక నిర్ణయాలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం



ఢిల్లీ: కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఢిల్లీలో స్మార్ట్ ట్రాఫిక్‌కు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఢిల్లీలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1,789.52 కోట్ల అంచనా వ్యయంతో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మిగతా 2 లో



## ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు..
## సీఎం రేవంత్ రెడ్డి అభినందన

- ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చర్ చికితకు రెండు స్వర్ణాలు
- చికితను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంస
- ఈ విజయంతో 2028 ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన చికిత
- పెద్దపల్లి జిల్లాకు చెందిన క్రీడాకారిణి చికిత

# తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చొరవ తీసుకోవాలి

మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించాం

- మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలి
- ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నాం
- ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలి
- సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలి



హైదరాబాద్: : తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి ఢిల్లీలో మిగతా 2 లో

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై దుమారం.. కాంగ్రెస్‌ను నిలదీసిన కవిత



- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన
- రెండు స్థానాల్లోనూ రెడ్డి సామాజిక వర్గానికే అవకాశం
- ఇది సామాజిక అన్యాయమంటూ కవిత తీవ్ర విమర్శ

హైదరాబాద్: తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలనూ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడం పూర్తి సామాజిక అన్యాయమని ఆమె ఆరోపించారు.

# సంపాదకీయం

## అసలు నకిలీ

మార్లిన్ మన్రో అంటే దాదాపుగా హాలీవుడ్ దేవత. జాన్ స్టెయిన్‌బెక్ ఏమో నోబెల్ గౌరవానికి నోచుకున్న నవలా రచయిత. సహజంగానే రచయితలకంటే నటీమణులకే క్రేజ్ ఎక్కువన్నది ఏ ప్రాంతానికైనా వర్తించే సత్యం కాబట్టి, అమెరికా కూడా అందుకు మినహాయింపు కాదు. స్టెయిన్‌బెక్ భార్య తరఫు మేనల్లుడైన ఓ 17 ఏళ్ల కుర్రాడు మార్లిన్ 'బానిస'. అలాంటివాడికి మార్లిన్‌ను స్టెయిన్‌బెక్ కలిశాడనే 'ఘోరమైనతప్పిదం' మేనత్త చేసిందట. ఆ కుర్రాడు దాన్ని నమ్మకపోయినా మామగారి పట్ల అతడి 'మర్యాద' ఆకాశాన్నంటింది. ఇక తప్పదన్నట్టుగా, ఆటోగ్రాఫ్ చేసిన ఒక ఫొటోను పంపమంటూ 1955లో న్యూయార్క్ నుంచి మార్లిన్‌కు ఓ లేఖ రాశాడు స్టెయిన్‌బెక్. భాష, శైలి, చమత్కారం వల్ల పదేపదే వైరల్ అయ్యే ఈ లేఖను ఈమధ్యే ప్యాట్రిక్ ఓషానెసీ అనే వ్యాపారవేత్త 'ఎక్స్'లో పంచుకున్నాడు. దీన్నే శశి థరూర్ ఓ నాలుగేళ్ల కింద షేర్ చేశాడు. అయితే, ఇందులోని శైలి స్టెయిన్‌బెక్‌దే అయినా, నిజంగా ఆయనే రాశాడనేందుకు ఆధారాలు లేవనే సందేహాలూ ఉన్నాయి. స్టెయిన్‌బెక్‌ది కాకపోతే స్టెయిన్‌బెక్ అంతటివాడు ఆవహించి రాసినదై ఉండాలి.

చరిత్రలో కొన్ని అబద్ధాలు ఎంత అందంగా ఉంటాయంటే అవి నిజమైతే బాగుండనిపిస్తుంది. ఒక మహానుభావుడి చేతిరాత కనిపిస్తే, ఒక నియంత రహస్య డైరీ దొరికితే, ఒక గొప్ప కవి ప్రేమలేఖ చేతికి చిక్కితే-- అవి నిజం కాదనే అనుమానమే అన్యాయంగా తోస్తుంది. అందుకే చరిత్రలోని కొన్ని మోసాలు కేవలం మోసాలుగా మిగిలిపోలేదు. సాహిత్యాన్నీ, జర్నలిజాన్నీ, పరిశోధననూ, మనుషుల ఊహాశక్తినీ పరీక్షించిన అద్భుతమైన కథనాలుగా మిగిలిపోయాయి. 1983లో జర్మన్ పత్రిక స్టెర్న్ 1932 నుంచి 1945 వరకు అడాల్ఫ్ హిట్లర్ రాసినట్లుగా చెప్పిన దాదాపు అరవై సంపుటాల డైరీలు దొరికాయని ప్రకటించింది. యుద్ధం చివరి దశలో హిట్లర్ వ్యక్తిగత వస్తువులను తరలిస్తున్న విమానం కూలిపోవడంతో ఆ డైరీలు బయటపడ్డాయని కథనం. కానీ ఫోరెన్సిక్ పరీక్షలు కాగితం, సిరా రెండో ప్రపంచ యుద్ధం తర్వాతివని తేల్చాయి. కోన్రాడ్ కుజావు అనే చిత్రకారుడి సృజనాత్మక మోసం అలా బయటపడింది.

ముందు వాటిని అసలువని ఎందుకు నమ్మారు? అవి నిజమైతే బాగుండనే భావన మనుషులను అమాయకులను చేయడంవల్ల. ఇదే బలహీనత అబ్రహాం లింకన్ ప్రేమలేఖల ఉదంతంలోనూ కనబడుతుంది. 1928లో అమెరికా పత్రిక అట్లాంటిక్ మంత్లీలో 'లింకన్ ద లవర్' పేరుతో ఆన్ రట్లెడ్జ్‌కు లింకన్ రాసినట్టుగా చెప్పిన లేఖలు ప్రచురితమయ్యాయి. కానీ వాటి భాష, శైలి, ఆ కాలపు పదప్రయోగాలు అనుమానాస్పదంగా తోచాక రచయిత్రి విల్మా ఫ్రాన్సిస్ మైనర్ చేసిన సాహిత్య మోసం బయటపడింది. ఇక 18వ శతాబ్దం చివర్లో లండన్‌లో విలియం హెన్రీ ఐర్లాండ్ అనే కవి ఏకంగా షేక్స్పియర్ స్వహస్తాలతో రాసిన లేఖలు, అన్నే హాత్‌వేకి రాసిన ప్రేమలేఖలు, కింగ్ లియర్, హామ్లెట్ వంటి రచనల చేతిరాత ప్రతులతోపాటు షేక్స్పియర్ సరికొత్త నాటకం 'వాటిగెర్న్ అండ్ రొవెనా'ను 'కనుగొన్నాడు'. ఇంత కష్టపడి ఎందుకు నకిలీవి సృష్టిస్తారంటే దానికున్న మార్కెట్, సంచలన యావ, సరదా. అంతెందుకు, సాంస్కృతిక వారసత్వపు వెన్నువిరవకుండా భారతదేశాన్ని జయించలేమని ప్రచారంలో ఉన్న 1835 ఫిబ్రవరి 2 నాటి లార్డ్ మెకాలే ప్రసంగం కూడా ఉత్తిదేనని కథనాలు వెలువడ్డాయి. భావజాల పరంగా మెకాలే అలాంటివాడే కావొచ్చుగానీ ఆ లేఖ మీద మాత్రం వివాదం లేకుండా లేదు.

ఇప్పుడు ఇదంతా ఎందుకంటే, స్టీఫెన్ థేలర్ అనే ఏఐ పరిశోధకుడు 'ఎ రీసెంట్ ఎంట్రన్స్ టు ప్యారడైజ్' అనే చిత్రాన్ని డాబస్ ఏఐ టూల్‌తో గీయించి, ఆ చిత్ర సృష్టికర్తగా దాన్నే అంగీకరించాలని పెట్టుకున్న కాపీరైటు అర్జీని భారత ప్రభుత్వ కాపీరైట్ కార్యాలయం ఇటీవలే కొట్టేసింది. దాన్ని ఒరిజినల్ వర్క్‌గా అంగీకరిస్తూనే, మానవ ప్రమేయం లేని ఈ కళకు కాపీరైట్ ఇవ్వడానికి తిరస్కరించింది. తనను సృష్టికర్తగా చెప్పుకోవడానికి థేలర్ అంగీకరించలేదు. కృత్రిమ నకిలీల కాలంలో ఆ మేరకు ఆయన సహజ అభినందనకు అర్హుడు.

### డెల్టా సీఈవోపై మస్క్ ఫైర్..
## మీ ఉద్యోగం ఊడుతుంది జాగ్రత్త అంటూ వార్నింగ్!

ఢిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ డెల్టా ఎయిర్‌లైన్స్, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. తమ విమానాల్లో వైఫై సేవల కోసం మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌ను కాదని, అమెజాన్‌కు చెందిన 'లియో' శాటిలైట్ వ్యవస్థను ఎంచుకోవడంపై మస్క్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు డెల్టా సీఈవో ఎడ్ బాస్టియన్ తన ఉద్యోగాన్ని కోల్పోతారని హెచ్చరించడం సంచలనం సృష్టిస్తోంది. ఈ వివాదానికి అసలు కారణం డెల్టా సీఈవో ఎడ్ బాస్టియన్, మస్క్ ప్రతిష్టపై చేసినట్లుగా చెబుతున్న కొన్ని వ్యాఖ్యలు. ఒక కంపెనీ కార్యక్రమంలో ఉద్యోగులతో మాట్లాడుతూ.. మస్క్‌తో కలిసి పనిచేయడానికి తాము ఇష్టపడలేదని బాస్టియన్ అన్నట్లు ఏవియేషన్ రిపోర్టర్ ఒకరు వెల్లడించారు. "మస్క్ ప్రతిష్ట గురించి మీకు తెలిస్తే, ఆయన గురించి బయట చెప్పేవన్నీ నిజాలే" అని బాస్టియన్ వ్యాఖ్యానించినట్లు ఆ రిపోర్ట్ పేర్కొంది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవడంతో మస్క్ దృష్టికి వెళ్లాయి. దీనిపై ఆయన ఘాటుగా స్పందించారు. 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. "ఈ నిర్ణయం వల్ల బాస్టియన్ తన ఉద్యోగాన్ని కోల్పోతారు" అని హెచ్చరించారు. అంతటితో ఆగకుండా డెల్టా కనెక్టివిటీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. స్టార్‌లింక్ కనెక్టివిటీ లేనందున, ఒక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థను బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేయాలంటే దాన్ని డెల్టా విమానంలో ఉంచడమే సరైన మార్గమని చురక అంటించారు. ఈ నిర్ణయం వల్ల డెల్టా గణనీయమైన సంఖ్యలో కస్టమర్లను కోల్పోవచ్చని ఆయన గతంలోనే హెచ్చరించారు. గత మార్చి నెలలో డెల్టా ఎయిర్‌లైన్స్, అమెజాన్‌తో బహుళ-సంవత్సరాల ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం 2028 నుంచి దశలవారీగా 500 విమానాల్లో అమెజాన్ 'లియో' శాటిలైట్ ఆధారిత వైఫై సేవలను ప్రారంభించనుంది. అయితే, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వంటి అనేక ప్రత్యర్థి సంస్థలు ఇప్పటికే తమ విమానాల్లో వేగవంతమైన స్టార్‌లింక్ సేవలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డెల్టా నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. అయితే, తమ నిర్ణయాన్ని డెల్టా సమర్థించుకుంటోంది. ఇది కేవలం వైఫై ఒప్పందం మాత్రమే కాదని, అమెజాన్‌తో తమకున్న విస్తృత భాగస్వామ్యంలో భాగమని స్పష్టం చేసింది. డెల్టా ఇప్పటికే తమ 600 అప్లికేషన్ల కోసం 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' (ఏడబ్ల్యూఎస్)ను వినియోగిస్తోంది. భవిష్యత్తులో అమెజాన్ క్లౌడ్, రిటైలింగ్, ప్రైమ్ వీడియో, గేమింగ్ టెక్నాలజీ వంటి సేవలను కూడా ప్రయాణికులకు అందించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని వివరిస్తోంది. అయినప్పటికీ, డెల్టా నిర్ణయంపై విమర్శలు వస్తున్నాయి. మస్క్ స్టార్‌లింక్ ఇప్పటికే వేలాది శాటిలైట్లతో పూర్తిస్థాయి నెట్‌వర్క్‌ను కలిగి ఉండగా, అమెజాన్ 'లియో' ప్రాజెక్ట్ ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. స్టార్‌లింక్‌తో పోలిస్తే అమెజాన్ శాటిలైట్ల సంఖ్య చాలా తక్కువ. ఈ నేపథ్యంలో నిరూపితమైన టెక్నాలజీని కాదని, ఇంకా అభివృద్ధి దశలో ఉన్న వ్యవస్థను ఎంచుకోవడం సరైన వ్యూహం కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, అమెజాన్‌తో భాగస్వామ్యం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని డెల్టా ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ టెక్ యుద్ధంలో ఎవరి వ్యూహం ఫలిస్తుందో కాలమే నిర్ణయించాలి.

## వైఎస్ జగన్‌ను కలిసిన లంకపల్లి రైతులు

తాడేపల్లి : కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం, పమిడిముక్కల మండలం లంకపల్లి గ్రామానికి చెందిన రైతులు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తమ గ్రామ పరిధిలోని సుమారు 600 ఎకరాల లంక భూములకు సంబంధించి తీవ్ర అవకతవకలు చోటు చేసుకున్నాయని వైఎస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు రైతులు. 1952 నుంచి ఆ భూములను సాగు చేసుకుంటున్న రైతులమైన తమను పక్కనపెట్టి, స్థానిక టీడీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై టీడీపీ నాయకులు, వారి బినామీల పేర్లతో అనధికారికంగా పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ హక్కులను కాదని, రాజకీయ ప్రాబల్యంతో భూములను ఇతరుల పేర్లకు మార్చి వారి పేరుతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేశారని వైఎస్ జగన్‌కు ఫిర్యాదు చేశారు సదరు రైతులు. లంక భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తమకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ అండగా నిలవాలని వైఎస్ జగన్‌ను కోరారు రైతులు. రైతుల సమస్యలను, వారి ఆవేదనను విన్న వైఎస్ జగన్.. వారికి అవసరమైన న్యాయం సహాయం పార్టీ తరఫున అందిస్తామని భరోసా ఇచ్చారు. బాధిత రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

### ఇండి కూటమి భేటీలో
## దేశ వ్యాప్తంగా నిరసనలకు నిర్ణయం

ఢిల్లీ: ఢిల్లీలో ఇండి కూటమి సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎన్నికల సంఘం పనితీరు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై చర్చించేందుకు ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఈ సమావేశం జరిగింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించేందుకు పార్లమెంట్‌లో తీర్మానం ప్రవేశపెట్టే నోటీసు ముసాయిదాపై కూటమి చర్చించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఇండి కూటమి నేతలం జిల్లా, కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతాం. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం వరకు పాదయాత్ర నిర్వహిస్తాం. సంస్థలను ఏ విధంగా స్వాధీనం చేసుకుంటున్నారో రాష్ట్రపతికి తెలియజేయడానికి ప్రతిపక్ష నాయకులం అందరం అక్టోబర్ రెండవ వారంలో కలవడానికి అపాయింట్‌మెంట్ కోరుతాం. అక్టోబర్-నవంబర్ నెలల్లో దేశవ్యాప్తంగా ఐదు ప్రధాన ర్యాలీలు నిర్వహిస్తాము. ర్యాలీల తేదీలు, వేదికలను త్వరలోనే ఖరారు చేస్తాము. నవంబర్ 1న ఢిల్లీలో ఒక భారీ ర్యాలీని నిర్వహిస్తాం. ఓటు చోరీపై రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ చెప్పే మాటలను ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు" అని తెలిపారు. కాగా, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిలిపివేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఓటరు జాబితాల నుంచి పేర్లు తొలగించిన అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు చేయాలని ఇండి కూటమి నేతలు కోరుతున్నారు. కూటమిలో 21 పార్టీలు పాల్గొన్నాయి. గతంలో 23 పార్టీలుగా ఉన్న ఇండి కూటమి నుంచి డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ సమావేశానికి దూరంగా ఉన్నాయి. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సమావేశానికి హాజరుకావడం కాలేదు. ఆయన స్థానంలో ఎంపీలు హరేంద్ర మాలిక్, మొహిబ్బుల్లా నద్వీ పాల్గొన్నారు. సమావేశానికి డీఎంకే దూరంగా ఉన్నప్పటికీ, జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంట్‌లో తొలగింపు తీర్మానం వస్తే మద్దతు ఇస్తామని ఆ పార్టీ ప్రతినిధి టీకేఎస్ ఎలంగోవన్ తెలిపారు.

### ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలు..
## సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

అమరావతి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ నెల 11 నుంచి 20 వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి ప్రసాదాన్ని అందించి, వేదాశీర్వచనం పలికారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లపై చంద్రబాబు ఆరా తీశారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై దుమారం..
## కాంగ్రెస్‌ను నిలదీసిన కవిత

హైదరాబాద్: తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలనూ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడం పూర్తి సామాజిక అన్యాయమని ఆమె ఆరోపించారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ ఇద్దరు అభ్యర్థులు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే కావడంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా కవిత స్పందించారు. "రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీట్లు... రెండు చోట్లా రెడ్డి నేతలకే టికెట్లు... ఇది పూర్తి సామాజిక అన్యాయం కాదా?" అని ఆమె ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో బలహీన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉంటుందని, కేవలం ఒకే వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం తెలంగాణ ఆత్మగౌరవానికి విరుద్ధమని ఆమె పేర్కొన్నారు.

### కిటకిటలాడుతున్న తిరుమల గిరులు..
## సర్వదర్శనానికి పోటెత్తిన భక్తులు..

తిరుపతి: తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూలైన్లు కాంప్లెక్స్ వెలుపలి వరకు విస్తరించడంతో తిరుమల గిరులు భక్తజనసందోహంతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని తలపిస్తున్నాయి. దర్శన టికెట్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 24 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షిస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకులు నిరంతరం సేవలందిస్తున్నారు. భక్తులకు అన్నప్రసాదం, మంచినీరు, పాలు పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వారికి వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే 77,082 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు టీటీడీ గణాంకాలు వెల్లడించాయి. వీరిలో 34,039 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.22 కోట్లుగా నమోదైంది. భక్తుల రద్దీ దృష్ట్యా అందరూ సంయమనం పాటించి, క్షేత్రస్థాయి సిబ్బందికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

### నా ఆస్తులు రూ.1,400 కోట్లు,
## అన్నీ చట్టబద్ధమే: డీకే శివకుమార్

కర్ణాటక : తన ఆస్తుల విషయంలో కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి చేస్తున్న ఆరోపణలపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఘాటుగా స్పందించారు. తన ఆస్తులన్నీ చట్టబద్ధంగా సంపాదించినవేనని, ఆదాయపు పన్ను శాఖకు అన్ని వివరాలు వెల్లడించానని స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, కుమారస్వామిపై ఎదురుదాడికి దిగారు. "అవును, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నాకు రూ.1,400 కోట్ల ఆస్తులు ఉన్నాయి. అవన్నీ చట్టపరిధిలోనే సంపాదించాను. కుమారస్వామి నిరాశ, నిస్పృహలతో ఇలా మాట్లాడుతున్నారు" అని శివకుమార్ అన్నారు. బీజేపీ-జేడీఎస్ కూటమిలో నెలకొన్న అంతర్గత విభేదాలే కుమారస్వామి అసహనానికి కారణమని ఆయన ఆరోపించారు. నైస్ ప్రాజెక్టుపై కుమారస్వామిని శివకుమార్ నిలదీశారు. "ఆయన తండ్రి హెచ్.డి.దేవెగౌడ ఆ ప్రాజెక్టు ఒప్పందంపై సంతకం చేశారు. కుమారస్వామి కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అప్పుడు ఈ విషయంపై ఎందుకు మౌనంగా ఉన్నారు? గాంధీ అనే వ్యక్తికి టెండర్ కట్టబెట్టాలని ప్రయత్నించి, కోర్టుతో మొట్టికాయలు కూడా తిన్నారు. బినామీ పేర్లతో ఎన్నో లావాదేవీలు జరిగాయి. ఆయనలా నేను పేర్లు చెప్పాలనుకోవడం లేదు" అని విమర్శించారు. ఒక రైతు కుమారుడిగా, పారిశ్రామికవేత్తగా తాను ఆస్తులు సంపాదించడంలో తప్పేంటని శివకుమార్ ప్రశ్నించారు. "నాకు ఆస్తులు ఉండకూడదా? నా పిల్లలు ఆస్తులు కొనకూడదా? చట్టం అనుమతించిన మేరకే అన్నీ చేశాను. కుమారస్వామి ఏమైనా ఐటీ అధికారా? ఆయన దగ్గర సమాచారం ఉంటే ఆదాయపు పన్ను శాఖకు ఇవ్వమనండి" అని సవాల్ విసిరారు. బెంగళూరు-మైసూరు ఇన్ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ (నైస్ రోడ్), బిడది టౌన్‌షిప్ ప్రాజెక్టుల పరిధిలో కుమారస్వామి, ఆయన కుటుంబ సభ్యులకు ఆస్తులు ఉన్నాయా? అని ఆయన ప్రశ్నించారు. శోభా డెవలపర్స్‌లో రూ.5 కోట్లు పెట్టుబడి పెట్టి దాని విలువను రూ.2,000 కోట్లకు పెంచారన్న ఆరోపణలను కూడా శివకుమార్ తోసిపుచ్చారు. "దివంగత మాజీ సీఎం ఎస్.బంగారప్ప హయాంలో రూ.99,000కు ఒక స్థలం కొన్నాను. ఈ రోజు దాని విలువ రూ.20 కోట్లు. ఇందులో తప్పేముంది? నేను లంచం తీసుకున్నానా? ఏదైనా స్కామ్‌లో దొరికానా? అలాంటిదేమీ జరగలేదు. నాకు ఇలాంటి వందల ఆస్తులున్నాయి" అని వివరించారు. విధానసౌధ మెట్లపై చర్చకు రావాలన్న కుమారస్వామి సవాల్‌పై స్పందిస్తూ, చర్చ జరగాల్సింది అసెంబ్లీలో అని, కావాలంటే ఫ్రీడమ్ పార్క్‌లో బహిరంగ చర్చ పెట్టుకోవచ్చని సూచించారు. దేశవ్యాప్తంగా టోల్‌లను రద్దు చేయలాని ప్రధాని మోదీని కోరే దమ్ము కుమారస్వామికి ఉందా? అని ప్రశ్నించారు. "ఆరోపణలు పార్ట్ 1 మాత్రమేనన్న వ్యాఖ్యలకు, బెదిరింపులకు, స్టింగ్ ఆపరేషన్లకు భయపడను. స్వామీజీల ఫోన్లనే ట్యాప్ చేసిన వారు నన్ను వదులుతారా? ఆయన సీఎంగా ఉన్నప్పుడే నేను భయపడలేదు, ఇప్పుడు భయపడతానా? మా ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను వారు తట్టుకోలేకపోతున్నారు. అసూయకు మందు లేదు" అని శివకుమార్ అన్నారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల కమిషన్, ఈడీ వద్ద ఉన్నాయని, ఏ పెద్ద ఏజెన్సీతోనైనా దర్యాప్తు చేయించుకోవడానికి తాను సిద్ధమని స్పష్టం చేశారు.

## దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ అగ్ర స్థానంలో ఉంది

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ, అన్నక్యాంటీన్లు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం, సంక్షేమ హాస్టళ్లల్లో వసతులు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు కెపాసిటీ బిల్డింగ్, నైపుణ్య శిక్షణలో దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ అగ్ర స్థానంలో ఉందని సీఎం చెప్పారు. ఐగాట్ కర్మ యోగి ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇప్పించామని... రియల్ టైమ్‌లో పని చేసేలా ఉద్యోగులు శిక్షణ పొందుతున్నారన్నారు. వివిధ వర్చువల్ కోర్సుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఐఏఎస్ అధికారులు ఎప్పటికప్పుడు ఓరియేంటేషన్ తీసుకుంటూ స్కిల్స్ అప్‌గ్రేడ్ చేసుకుంటారో... అదే తరహాలో ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులకు అవసరమైన నైపుణ్య శిక్షణ కోసం ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణ ఇప్పించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక తాగునీటి సమస్యను నివారించే విషయంలో ఎంత మాత్రం నిర్లక్ష్యం వహించొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమీక్ష సందర్భంగా పట్టణాల్లో తాగునీటి సరఫరా ఎలా ఉందని అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో వర్షాలు పడడంతో పట్టణాల్లో తాగునీటి సమస్య చాలా వరకు తగ్గిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. రాయలసీమలో రెండు మున్సిపాల్టీల్లో కొద్దిపాటి తాగునీటి సమస్య ఉందని.. దాన్ని అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక విశాఖ నగరంలో కూడా గ్రౌండ్ వాటర్ రీఛార్జ్ అయిందని.. తాగునీటి సమస్యను అధిగమిస్తున్నామని అధికారులు వివరించారు. పట్టణాల్లో కానీ.. పల్లెల్లో కానీ తాగునీటి సమస్య ఉత్పన్నం కాకూడదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షాలు పడ్డాయని నిర్లక్ష్యంతో ఉండొద్దని సూచించారు. ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వాములను చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

### ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు
## రెండు స్వర్ణాలు.. సీఎం రేవంత్ రెడ్డి అభినందన

హైదరాబాద్: ఆసియా క్రీడల్లో ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటిన తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితా రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. తన అద్భుత విజయంతో చికిత తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని, రాష్ట్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిందని కొనియాడారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేస్తూ, చికిత పట్టుదల, నిరంతర సాధన, దృఢ సంకల్పం యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఆమె ప్రతిభను గుర్తించి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన చికిత.. ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఉమెన్స్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలను కైవసం చేసుకుంది. ముఖ్యంగా, మిక్స్‌డ్ టీమ్‌లో తన భాగస్వామి సాహిల్ జాదవ్‌తో కలిసి సాధించిన ఈ విజయంతో ఆమె 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం విశేషం. ఈ విజయం తెలంగాణ క్రీడా రంగంలో నూతనోత్సాహాన్ని నింపింది.

## మహిళల కోసం భవిష్యత్తులో ఏసీ బస్సులు కొంటాం

విజయవాడ: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. 26,401 మందికి ఇళ్ల పట్టాలు అందిస్తున్నాం. గత వైకాపా పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం. కొందరు నేతలు మీ భవిష్యత్తుతో ఆటలాడుకున్నారు. గత ప్రభుత్వం భూ సర్వే పేరుతో ప్రతి ఊరిలో వివాదాలు సృష్టించింది. మీ ఆస్తులపై, పాస్‌బుక్‌లపై వారి బొమ్మలు వేసుకున్నారు. మేం మాత్రం ప్రభుత్వ రాజముద్రతో పాస్‌బుక్‌లు, పట్టాలు ఇస్తున్నాం. వైకాపా పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనకు తేడా గమనించాలి. మొన్న విశాఖలో, నిన్న మంగళగిరిలో నేడు విజయవాడలో పేదలకు పట్టాలు ఇవ్వడం జీవితంలో మర్చిపోలేను. మొత్తం 60 వేల మందికి పట్టాలు ఇచ్చాం. దీని విలువ సుమారు రూ.52 వేల కోట్లు. ఇవాళ పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరుగుతోంది. పేదల చిరకాల వాంఛ నెరవేర్చాం. వారు ఆనందంగా ఉండటమే నిజమైన అభివృద్ధి. ఈ ఆస్తిని అమ్ముకోవద్దు, భవిష్యత్తు కోసం ఉంచుకోండి. 108 ఏళ్ల నుంచి ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం. పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే మూడు పార్టీలు కలిశాయి. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం. మహిళల కోసం భవిష్యత్తులో ఏసీ బస్సులు కొంటాం" అని సీఎం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చొరవ తీసుకోవాలి

మొదటి పేజి తరువాయి

బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి ఢిల్లీలో జల్ శక్తి మంత్రి పాటిల్ గారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ం152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి ం కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని వివరించారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్తు వినియోగం, విద్యుత్తు వ్యయం తగ్గుతుందని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు , గౌరవెల్లి రిజర్వాయర్‌కు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి గారు విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని తెలిపారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న టెలీమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని పాటిల్ ని ముఖ్యమంత్రి కోరారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ. 4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాలను ఏర్పాటు చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు.

### రబీ సీజన్ కు పంటల మద్దతు ధర
## పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం

ఢిల్లీ: కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఢిల్లీలో స్మార్ట్ ట్రాఫిక్‌కు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఢిల్లీలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1,789.52 కోట్ల అంచనా వ్యయంతో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుకు ఆమోదం తెలిపింది. ఢిల్లీలోని 42 ప్రధాన ట్రాఫిక్ కారిడార్లను మూడు దశల్లో 24 నెలల్లో ఈ వ్యవస్థ పరిధిలోకి తీసుకురానున్నారు. ఏఐ ఆధారిత అడాప్టివ్ ట్రాఫిక్ సిగ్నల్స్, రియల్‌టైమ్ ట్రాఫిక్ సమాచారం, ఆటోమేటెడ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అందుబాటులోకి తెస్తారు. అంబులెన్సులు, అత్యవసర వాహనాలకు గ్రీన్ కారిడార్ సౌకర్యం కల్పించనున్నారు. ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలను రియల్‌టైమ్‌లో గుర్తించి వేగంగా స్పందించేలా వ్యవస్థను రూపొందించనున్నారు. రాంగ్ రూట్, స్పీడింగ్, రెడ్‌లైట్ జంపింగ్, హెల్మెట్, సీట్‌బెల్ట్ ఉల్లంఘనలను టెక్నాలజీతో గుర్తించనున్నారు.

కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

రబీ సీజన్ కు పంటల మద్దతు ధర పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం, 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి ఆరు రబీ పంటల కనీస మద్దతు ధరలను (మీఎస్పీ) పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కుసుమకు అత్యధికంగా క్వింటాల్‌కు రూ.675, ఆవాలు-రాప్‌సీడ్‌కు రూ.413 చొప్పున పెంచింది. మసూర్ పప్పుకు రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 పెంపు లభించింది. పెరిగిన ధరలతో గోధుమ మీఎస్పీ రూ.2,610, శనగ రూ.5,958, మసూర్ రూ.7,390, ఆవాలు రూ.6,613, కుసుమ రూ.7,215, బార్లీ రూ.2,286కు చేరింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యమని కేంద్రం వెల్లడి. గ్రీన్ ఎనర్జీ కారిడార్-3కు కేంద్ర కేబినెట్ ఆమోదం. రూ.1,86,405 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ పథకం ద్వారా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 135 గిగావాట్ల వరకు పునరుత్పాదక విద్యుత్‌ను గ్రిడ్‌లోకి అనుసంధానం. 50 గిగావాట్ అవర్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ఏర్పాటు . 2032-33 ఆర్థిక సంవత్సరం నాటికి పథకాన్ని పూర్తి చేయాలని లక్ష్యం. కేంద్ర ఆర్థిక సాయం రూ.54,082 కోట్లు. విద్యుత్ ప్రసార ఖర్చులను తగ్గించడంతో పాటు పునరుత్పాదక ఇంధన వినియోగం పెంచేందుకు ఈ పథకం దోహదం.

### కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ
## ప్రచారం జరుగుతున్న వేళ... మల్లు భట్టి కీలక వ్యాఖ్యలు!

హైదరాబాద్: వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు


రామ్మోహన్‌రెడ్డి


సర్వోత్తమ్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ శాసనమండలికి త్వరలో జరగనున్న పట్టభద్రుల కోటా ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. మహబూబ్ నగర్--రంగారెడ్డి --హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గానికి సామ రామ్మోహన్ రెడ్డి, వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని ఎంపిక చేశారు. వీరి ఎంపికకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అధికారికంగా ప్రకటించారు. ఈమేరకు ఢిల్లీలోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. సామ రామ్మోహన్ రెడ్డి స్వస్థలం రంగారెడ్డి జిల్లా. ఈయన టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ ఛైర్మన్‌గా, ముఖ్య అధికార ప్రతినిధిగా పని చేశారు. రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా, అలాగే యూత్ కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధిగా పని చేశారు. 2017లో లీగల్ సెల్ ఉపాధ్యక్షుడిగా, 2019లో అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించారు. రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిది సూర్యాపేట జిల్లా. ఈయన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు. యూత్ కాంగ్రెస్ రాజకీయాల్లో చురుకుగా ఉన్నారు. నల్లగొండ జిల్లాలోనూ పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా వ్యవహరించారు. ఏఐసీసీ మెంబర్ అయిన సర్వోత్తమ్ రెడ్డి యూత్ కాంగ్రెస్‌లో పలు హోదాల్లో పనిచేశారు.

శివ సూర్య
APTEL - 16423 ఎడిటర్ ; జి.శివరాముడు

జనరల్ న్యూస్

గురువారం - 01 - అక్టోబర్ - 2026

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చిన కౌతాళం మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద ఆచారి



కౌతాళం,శివసూర్య,సెప్టెంబర్ 30: మంత్రాలయం నియోజవర్గ వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే వై.బాలనాగరెడ్డి ఆదేశాల మేరకు మరియు కౌతళం మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ దేశాయి ప్రహ్లాదఆచారి ఆధ్వర్యంలో కౌతాళంలో వైయస్సార్ పార్టీ ఆఫీసు నందు కార్యకర్తల సమావేశం చేయడం జరిగింది.దేశాయి ప్రహ్లాద ఆచారి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పార్టీ కార్యకర్తలు అందరూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని అలాగే కూటమి ప్రభుత్వం చేసే పనులు మరియు వివిధ హామీ పథకాలు ఇవ్వడం లేదని మరి రైతులకు అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వం గురించి ప్రజల్లో తీసుకువెళ్లాలని కార్యకర్తలకు మరియు నాయకులకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాదాచారి వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి లింగారెడ్డి నర్స రెడ్డి మాజీ సర్పంచులు అవతారం పాల్ దినకర్ మాజీఉప సర్పంచ్ సక్రితిక్కయ్య వడ్డే రాము పూజారిలింగ వెంకటరమరాజు ఉమేష్ మొహమ్మద్ వడ్డే చిన్నఉసేని బెస్తేమరి స్వామి బెస్త నాగరాజు బెస్తనారాయణ బెస్తరాగప్ప కబడ్డీహరీష్ నరసింహ వడ్డే అంజి మహేంద్ర మహమ్మద్ వడ్డే గురు +.ఐ.ఖదర్ ఉపేంద్ర సిద్ధ రామకృష్ణ ఉప్పర్ మల్లి హనీఫ్ కాసిం సుధాకర్ ఎన్టీఆర్ నగర్ భాష సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ మరియు వార్డ్ మెంబర్లు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ డెలివరీలలో అదనపు వసూళ్లకు అడ్డుకట్ట
## కౌతాళంలో ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు
### దీపం లబ్ధిదారులను అడిగి తెలుసుకున్న ఆర్డీవో- గ్యాస్ గోడన్ తనిఖీ



కౌతాళం,శివసూర్య,,సెప్టెంబర్ 30: మండల కేంద్రమైన కౌతాళంలో గ్యాస్ గోడౌన్‌ను ఆదోని డివిజన్ ఆర్డీవో అరుణ దేవి బుధవారం తహసీల్దార్, సీఎస్‌డీటీ, డీఐఓలతో కలిసి తనిఖీ చేశారు. గ్యాస్ నిల్వలు, సరఫరా విధానం, వినియోగదారులకు గ్యాస్ డెలివరీ ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు. ఈ



సందర్భంగా ఆర్డీవో మాటాడుతూ...దీపం పథకం లబ్ధిదారులతో , గ్యాస్ సరఫరా, డెలివరీ సమయంలో చెల్లించాల్సిన ధరలు, అనుమతించబడిన ఛార్జీలపై అవగాహన కల్పించారు.గ్యాస్ డెలివరీకి సంబంధించి వినియోగదారుల నుంచి నిర్ణయించిన ధరలకు మించి అదనపు మొత్తాలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.అదేవిధంగా ఎరిగేరి , కౌతాళం గ్రామాల్లో దీపం పథకం లబ్ధిదారులతో మాట్లాడి, గ్యాస్ వినియోగం, డెలివరీ ధరలు, ఛార్జీలపై అవగాహన కల్పించారు. గ్యాస్ సరఫరాకు సంబంధించి లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం కౌతాళం గ్రామంలో ఫేజ్--6లో జరుగుతున్న రీ సర్వే జీటీ (+u) పనులను ఆర్డీవో అరుణ దేవి తహసీల్దార్, సంబధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతి,నాణ్యత అమలు తీరుపై వివరాలు తెలుసుకుని, నిర్దేశిత ప్రమాణాల మేరకు పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## అయోడిన్ లోపాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యల
## థైరాయిడ్ పైన సూక్ష్మ పోషక ఆహారం పైన అవగాహనసదస్సు




ఎమ్మిగనూరు,శివసూర్య, సెప్టెంబర్ 30: ఇనిస్ట్యూట్ ఫర్ ఇనిస్ట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో ఆశిర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రాజెక్ట్ భాగంగా ఐటిసి వారి సహకారంతో ఎమ్మిగనూర్ నియోజవర్గంలో గవర్నమెంట్ జూనియర్ గర్ల్స్ కాలేజ్ నందు అయోడిన్ లోపాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యల థైరాయిడ్ పైన సూక్ష్మ పోషక ఆహారం పైన అవగాహన కార్యక్రమం నాటక రూపంలో నిర్వహించడం జరిగింది ఇనిస్ట్యూట్ ఫర్ గూగుల్ డెవలప్మెంట్ వారి సహకారంతో కర్నూల్ జిల్లా డిస్టిక్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ సూచనల మేరకు అయోడిన్ లోపిస్తే లోపం ఎక్కువకాలం ఉంటే థైరాయిడ్ హార్మోన్లు తగ్గడం హైపోథైరాయిడిజం, మెడలో థైరాయిడ్ వాపు (గాయిటర్) వంటి సమస్యలు రావచ్చు. గర్భధారణ సమయంలో తీవ్రమైన లోపం శిశువు మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపవచ్చు.

### ఎక్కువ అయోడిన్ తీసుకుంటే?

ఎక్కువైతే మంచిదే అనుకోవడం సరికాదు. అధిక అయోడిన్ కూడా కొంతమందిలో థైరాయిడ్ పనితీరును దెబ్బతీయవచ్చు. అందువల్ల డాక్టర్ సలహా లేకుండా అయోడిన్ సప్లిమెంట్లు తీసుకోవడం మంచిది కాదు.మనం తినే రోజువారి ఆహారంలో ప్రతిరోజు ఆకుకూరలు కూరగాయలు ఎక్కువగా ఉండేలా అదే రకంగా పండ్లు ప్రతిరోజు తినేలా చూసుకోవాలి తెలిపారు. ఈ ప్రోగ్రాం ని ఎమ్మిగనూరు నియోజకవర్గ వార్ డబ్ల్యూ హనుమంతు ఆరోగ్యం పట్ల సూచనలు ఇవ్వడం జరిగింది.

## టాపర్ కోచింగ్ సెంటర్ ని సిజ్ చేయాలి
### స్కూల్ సమయంలో స్కూల్ లో ఉండాల్సిన విద్యార్థులు కోచింగ్ సెంటర్లు పెట్టుకున్న కోచింగ్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి ఎంఈఓ ఆంజనేయులు గారికి వినతిపత్రం అందజేసిన ఆర్ పి ఎస్ ఎఫ్,పిఆర్ఎస్ వై ఎఫ్ నాయకులు




శివసూర్య,: ఎమ్మిగనూరు పట్టణం లో ప్రభుత్వ నిబంధనలు కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న టాపర్ కోచింగ్ సెంటర్ ను సీజ్ చేయాలి అని ఎంఈఓ ఆంజనేయులు కి ఆర్పిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిది, పి ఆర్ ఎస్ వై ఎఫ్ రాష్ట కార్యదర్శి రఘునాథ్ లు వినతిపత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ టాపర్ కోచింగ్ సెంటర్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బడిలో ఉండాల్సిన విద్యార్థులను కోచింగ్ సెంటర్లు పెట్టుకోవడం జరుగుతుంది అని ఈ కోచింగ్ సెంటర్ లో విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో 50000 నుంచి 60000 తీసుకోవడం జరుగుతుంది కోచింగ్ సెంటర్లో సరైన వసతులు లేక అలాగే పోషక ఆహారం లేక దాదాపు 200 మంది పైగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కోచింగ్ సెంటర్ లో ఉన్న విద్యార్థులను ఉదయం నుంచి రాత్రి వరకు మానసిక ఒత్తిడి గురి అయ్యేలాగా ప్రవర్తిస్తున్నారని వారు అన్నారు. కోచింగ్ సెంటర్ల విద్యార్థులను ఏ మండలంలో అయితే హెచ్ ఎం లు మరియు ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు బోగస్ అటెండెన్స్ లో వేస్తున్నారు వారిపై కూడా చర్యలు తీసుకోవాలని టాపర్ కోచింగ్ సెంటర్లో ఉన్న విద్యార్థులను ఏ ఏ స్కూల్లో చదువుతున్నారు అక్కడికి విద్యార్థులు ను పంపించాలని ఎంఈఓ గారిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి ఎస్ ఎఫ్ డివిజన్ అధ్యక్షులు మాణిక్య ప్రసాద్, రత్నం, చరణ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు

# మంత్రాలయం నియోజకవర్గ టీడీపీలో అసంతృప్తి జ్వాలలు

### కౌతాళం మండలం రౌడూరులో పార్టీకి తెలుగు యువత మూకుమ్మడి రాజీనామా!

కౌతాళం,శివసూర్య,సెప్టెంబర్ 30 : మంత్రాలయం నియోజకవర్గ కౌతాళం మండలం రౌడూరు గ్రామం తెలుగుదేశం పార్టీలో తీవ్ర అసంతృప్తి చెలరేగింది. నియోజకవర్గంలోని కౌతాళం మండలం రౌడూరు గ్రామానికి చెందిన తెలుగు యువత, క్రియాశీలక కార్యకర్తలు పార్టీకి మూకుమ్మడిగా పార్టీ నుంచి తప్పుకుంటామని మీడియాకు కరపత్రం సమర్పించడం స్థానికంగా పెను సంచలనం సృష్టిస్తోంది. పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడి పనిచేస్తున్న తమకు స్థానిక నేతల తీరు వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని యువత ఆవేదన వ్యక్తం చేసింది. తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వైఖరితో పాటు, కౌతాళం మండల స్థాయి నాయకులు, జిల్లా అధ్యక్షుల పనితీరుపై తీవ్ర అసంతృప్తితోనే తాము ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వారు స్పష్టం చేశారు.

### నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ

ఈ సందర్భంగా రౌడూరు గ్రామ తెలుగు యువత ప్రతినిధులు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం, పటిష్టత కోసం రాత్రింబవళ్లు శ్రమించిన యువతను స్థానిక నాయకత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. నియోజకవర్గ ఇంచార్జ్ గానీ, మండల నాయకులు గానీ కార్యకర్తల సమస్యలను పట్టించుకోవడం లేదని, కనీస ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఈ విషయాలను జిల్లా



అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో, తీవ్ర మనస్తాపానికి గురై పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

### కూకటివేళ్లతో కదిలిన క్యాడర్

రౌడూరు గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో తెలుగు యువత, ముఖ్య కార్యకర్తలు ఒక్కసారిగా పార్టీని వీడటంతో మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ శ్రేణుల్లో అలజడి మొదలైంది. గతంలో ఏ ఎలక్షన్ వచ్చినా 300కు పైన వైసిపి ఆధిపత్యం ఉండేది 2024లో మేము చేరాక 80 కి చేరుకుందని సర్పంచ్ ఎలక్షన్లో టిడిపి గెలుచుకుని పార్టీ నాయకులకు గిఫ్టుగా ఇవ్వాలని కోరుకున్నాం ఈ విధంగా పత్రిక ప్రకటన ఇస్తున్నందుకు చాలా బాధగా ఉందని పార్టీ ముఖ్యమంత్రి కూడా దీనిపై దృష్టి సారించాలని లేకపోతే భవిష్యత్తులో టిడిపి చాలా ప్రమాదంలో ఉంటుందని పత్రిక ముఖంగా తెలియజేశాము. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో పార్టీని నమ్ముకున్న యువత ఇలా మూకుమ్మడిగా రాజీనామా చేయడం పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధిష్టానం స్పందించి స్థానిక లోపాలను సరిదిద్దకపోతే నియోజకవర్గంలో పార్టీ మరింత బలహీనపడే ప్రమాదం ఉందని పలువురు సీనియర్ నాయకులు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. రౌడూరు యువత తదుపరి రాజకీయ అడుగులు ఎటువైపు ఉంటాయనేది ఇప్పుడు నియోజకవర్గంలో ఆసక్తికరంగా మారింది.

# ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల అధ్యక్షుడిగా శ్రీరామ్ చాణుక్య ఏకగ్రీవ ఎన్నిక





మెళియాపుట్టి, శివ సూర్య సెప్టెంబర్ 30: మెళియాపుట్టి మండల కేంద్రంలో బుధవారం వీబీజీ రామ్ జీ (వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్) క్షేత్ర సహాయకుల సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల క్షేత్ర సహాయకులు హాజరైన ఈ సమావేశంలో సుదీర్ఘ చర్చల అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అనంతరం క్షేత్ర సహాయకుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలని డిప్యూటీ ఎంపీడీఓ అప్పయ్యకు వినతిపత్రం అందజేశారు.

**నూతన కార్యవర్గం వివరాలు :**

- అధ్యక్షులు : శ్రీరామ్ చాణుక్య
- ఉపాధ్యక్షులు : సిరిపురం జగదీశ్వరరావు
- ప్రధాన కార్యదర్శి : లొడగల శ్రీనివాసరావు
- కార్యదర్శి : రాజు మజ్జి
- కోశాధికారి : కుసుమూరు గోవర్ధన్ వనజాక్షి
- ఈసీ సభ్యులు : సిరిపురం షణ్ముఖరావు, సవర ప్రసన్న, చిన్నంటి ధనుంజయ, చౌదరి లవకుమార్, అదపాకల మోహన్

అనంతరంనూతన అధ్యక్షుడు శ్రీరామ్ చాణుక్య మాట్లాడుతూ..., తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, సంఘ సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. క్షేత్ర సహాయకుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కార్యవర్గం కట్టుబడి ఉంటుందన్నారు. వీబీజీ రామ్ జీ పథకాన్ని మండలంలో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## మెళియాపుట్టి స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన
### డిప్యూటీ డైరెక్టర్ - చండక నరసింహులు



మెళియాపుట్టి, శివ సూర్య సెప్టెంబర్ 30: మెళియాపుట్టి మండల స్పెషల్ ఆఫీసర్ గా చండక నరసింహులు (డిప్యూటీ డైరెక్టర్, టెక్కలి డివిజన్) బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మండల స్థాయి అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., గ్రామ పంచాయతీల్లో తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యంలో ఎక్కడా లోపం లేకుండా చూడాలని కార్యదర్శులకు



ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రగతి రిపోర్టులను కూడా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరుని సన్నిధిలో ప్రత్యేక పూజలు
## సూడా చైర్మన్ త్వరగా కోలుకోవాలి - దుక్క బాలరాజు



మెళియాపుట్టి , శివ సూర్య, సెప్టెంబర్ 30: మెళియాపూట్టి మండలం, పెద్ద పద్మాపురం లో వెలసిన కలియుగ వెంకటేశ్వర స్వామి గుడిలో ప్రత్యేక పూజలు జన సైనికులు నిర్వహించారు. సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ ఈ మధ్యకాలంలో



అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరిన విషయం తెలుసుకున్న జనసైనికులు ఆయన త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని మెళియాపూట్టి మండలం జనసేన పార్టీ సీనియర్ నాయకులు దుక్క బాలరాజు ఆధ్వర్యంలో పెద్ద పద్మ పురం గ్రామంలో వెలసియున్న కలియుగ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ సలాన అప్పలనాయుడు,రట్టి పాల్గుణరావు,లక్ష్మిపురం కిరణ్ కుమార్,పత్రి మణికంఠ, ఎన్ని మేఘన్నాధం,పిట్ట హరికృష్ణ, సోనాపురం జగదీశ్,నల్లకాంతం, చిన్నికృష్ణ, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి కేంద్ర కార్యాలయంలో
## కూటమి పార్టీల సమన్వయ సమావేశం -ఎమ్మెల్యే ఎంజీఆర్



మెళియాపుట్టి, శివ సూర్య, సెప్టెంబర్ 30: శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కూటమి పార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో పాతపట్నం ఎమ్మెల్యే, ప్రివిలేజ్ కమిటీ సభ్యులు మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయడం వంటి అంశాలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన పాలన, అభివృద్ధి ఫలాలు అందించేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన ఆవశ్యకతను వివరించారు

## ప్రతి నెల చివరి బుధవారం శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



మెళియాపుట్టి, శివ సూర్య సెప్టెంబర్ 30: శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు మొదలవలస రమేష్ అధ్యక్షతన నిర్వహించిన పార్లమెంటరీ కమిటీ సమావేశంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పాతపట్నం ఎమ్మెల్యే, అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ సభ్యులు మామిడి గోవిందరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....., స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు టీడీపీ శ్రేణులు సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రతి ఇంటికీ చేరవేయాలని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వంలో జిల్లా స్థాయిలో పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, గ్రామాలు, మండలాల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలని పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమాన్ని క్రమశిక్షణతో నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని కోరారు.

## వికసిత్- భారత్ తో గ్రామాల అభివృద్ధి
### సర్పంచ్ బి వజ్రమ్మ తిమ్మప్ప.



గట్టు (శివసూర్య ): ప్రజా పాలనలో భాగంగా మాచర్ల గ్రామపంచాయతీ ఆవరణంలో వికసిత్- భారత్ గ్రామీణ ఉపాధి మరియు జీవనోపాధి హామీ మిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం గ్రామంలోని సహజ వనరులు, ప్రజల అవసరాలు, గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి, వాటిని మ్యాప్‌లో నమోదు చేయడం, అలాగే గ్రామ అవసరాలకు అనుగుణంగా ఉపాధి హామీ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టడం. కార్యక్రమంలో భాగంగా మాచర్ల గ్రామానికి సంబంధించిన మ్యాప్‌ను తయారు చేయడం జరిగింది. గ్రామంలోని వివిధ ప్రాంతాలు, అందుబాటులో ఉన్న వనరులు, అభివృద్ధి అవసరాలను గుర్తించే అంశాలపై చర్చించారు. అలాగే గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులు, గ్రామ ప్రజలకు ఉపాధి కల్పించే అవకాశాలు, గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే పనులను గుర్తించి ప్రణాళిక రూపొందించడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులతో చర్చ జరిగింది. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులను గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పంచాయతీ కార్యదర్శి ముని నాయక్ టి ఏ చంద్రశేఖర్, కాంట్రాక్టర్ బి లోకేష్, మరియు మాచర్ల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శివ సూర్య
APTEL - 16423 ఎడిటర్ ; బి.శివరాముడు



# మహిళపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

### రూ.5.01 లక్షల జరిమానా విధిస్తూ సిద్దిపేట 1వ అదనపు జిల్లా న్యాయస్థానం తీర్పు




గజ్వేల్ : కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మహిళపై అత్యాచారం కేసులో నిందితుడు దండవేని ఇస్తారి (58)కి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,01,000 జరిమానా విధిస్తూ సిద్దిపేట 1వ అదనపు జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి వై. జయప్రసాద్ తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం.. కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటరిగా ఉన్న మహిళపై దండవేని ఇస్తారి అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు 2019 ఏప్రిల్ 27న కోహెడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి హుస్నాబాద్ సీఐ ఎ. శ్రీనివాస్ దర్యాప్తు అధికారిగా సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి పటిష్టమైన ఛార్జిషీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మారాములు న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. కేసు విచారణలో ప్రస్తుత హుస్నాబాద్ సీఐ కే. శ్రీధర్, సాక్ష్యాలను నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీడీఓ జె. వేణుగోపాల్, భరోసా ఇన్‌చార్జి అధికారి ఇన్‌స్పెక్టర్ బి. దుర్గ, భరోసా లీగల్ అధికారి సౌమ్య, భరోసా సిబ్బంది సమన్వయంతో సహకారం అందించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించింది. అనంతరం నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,01,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు, సిబ్బందిని సిద్దిపేట సీపీ రశ్మీ పెరుమాళ్, ఐపీఎస్ అభినందించారు. సమాజంలో మహిళల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, నేరస్థులకు శిక్ష పడేలా చేయడంలో రాజీపడబోమని సీపీ స్పష్టం చేశారు.

# పంటలను సమగ్రంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

### మార్కెట్‌కు తెచ్చిన మొత్తం పంటను కొనుగోలు చేయాలి

### రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మహేందర్‌రెడ్డి



గజ్వేల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆన్‌లైన్ పంటల నమోదు కార్యక్రమం చాలా నిదానంగా కొనసాగుతోందని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మహేందర్‌రెడ్డి అన్నారు. పంటలు చేతికొస్తున్న సమయంలో పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, సమగ్రంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న, పత్తి తదితర పంటలు చేతికొస్తున్నప్పటికీ వ్యవసాయ అధికారులు చేపడుతున్న రైతుల ఫొటో క్యాప్చర్ ప్రక్రియ 20 శాతం కూడా పూర్తికాలేదని ఆయన అన్నారు. పంటల కొనుగోలు సమయంలో గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్ ఉండి, పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదైతేనే కొనుగోలు చేయడం, పంటలకు వివిధ పరిమితులు విధించడం వంటి నిబంధనలతో రైతులు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ప్రస్తుతం పంటల నమోదు కోసం ఫొటో క్యాప్చర్ విధానాన్ని తీసుకురావడం వల్ల కూడా రైతులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో భూములకు సంబంధించిన అనేక సమస్యలు ఉన్నాయని, భూభారతిలో తప్పుగా నమోదైన వివరాలు, ఆన్‌లైన్‌లో భూముల వివరాలు లేకపోవడం, కౌలు రైతులు భూములను సాగు చేయడం వంటి కారణాలతో పంటల నమోదు ప్రక్రియలో ఆటంకాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన మొత్తం పంటను ఎలాంటి పరిమితులు లేకుండా కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఫొటో క్యాప్చర్ ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని జిల్లాస్థాయి అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించి, పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

# 2047 నాటికి రూ.80 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తిరుపతి ఎకనామిక్ రీజియన్






తిరుపతి, సెప్టెంబర్ 30: : తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల ఆర్థిక వృద్ధి అవకాశాలపై తిరుపతి ఎకనామిక్ రీజియన్ సదస్సులో విస్తృతంగా చర్చించారు. జోన్ సీఈఓ ముకేశ్ కుమార్ మీనా ఆధ్వర్యంలో భాగస్వాముల సదస్సు ప్రారంభమైంది. 2047 నాటికి తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను రూ.80 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. పరిశ్రమలు, పర్యాటకం, వ్యవసాయం, లాజిస్టిక్స్, సేవల రంగాల అభివృద్ధితో పాటు పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి సారించనున్నట్లు చెప్పారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, కనెక్టివిటీ, నైపుణ్యాభివృద్ధిని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.

# తిరుపతి ఆర్థిక ప్రాంత ప్రణాళిక-2047కు క్షేత్రస్థాయి సూచనలు కీలకం




తిరుపతి, సెప్టెంబర్ 30: తిరుపతి ఆర్థిక ప్రాంతం (టీఈఆర్) ప్రణాళిక--2047 రూపకల్పనలో క్షేత్రస్థాయి భాగస్వాముల సూచనలు కీలకమని టీఈఆర్ సీఈఓ ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. తిరుపతి కలెక్టరేట్‌లో తిరుపతి, చిత్తూరు, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల భాగస్వాములతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక, లాజిస్టిక్స్, పర్యాటక, వ్యవసాయ, సేవారంగాల సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. అభివృద్ధి లోటుపాట్లను గుర్తించి టీఈఆర్ పరిధిలో 50--60 కీలక ప్రాజెక్టులను గుర్తించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. స్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, ఆహార శుద్ధి, వ్యవసాయం, పర్యాటకం వంటి రంగాల్లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెంపునకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రహదారులు, రైల్వే, పోర్టులు, విమానాశ్రయాలు, విద్యుత్, నీరు, నైపుణ్యాభివృద్ధి వంటి మౌలిక వసతులను సమన్వయంతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి--తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం, తలకోన, శ్రీహరికోట తదితర ప్రాంతాలను అనుసంధానిస్తూ సమగ్ర పర్యాటక సర్క్యూట్ల అభివృద్ధికి భాగస్వాములు సూచనలు చేశారు. స్థానిక యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించాలని అభిప్రాయపడ్డారు. సదస్సులో జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, నిపుణులు, కేపీఎంజీ ప్రతినిధులు పాల్గొన్నారు. భాగస్వాముల సూచనలను పరిగణనలోకి తీసుకుని టీఈఆర్ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళిక రూపొందిస్తామని అధికారులు తెలిపారు.

# ఉత్సాహంగా జిల్లా యువజనోత్సవాలు-2026

చిత్తూరు, సెప్టెంబర్ 30: చిత్తూరు విజయమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు--2026ను బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150 మంది యువతీ యువకులు పాల్గొని జానపద నృత్యం, జానపద గీతాలు, వీధి నాటకం, పెయింటింగ్, కవితా రచన తదితర పోటీల్లో ప్రతిభ చాటారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ యువత విద్యతో పాటు కళలు, క్రీడలు, సృజనాత్మకత, సామాజిక బాధ్యతలో ముందుకు సాగాలని సూచించారు. రాజుఎజుచీ సీఈఓ డా. యశ్వంత్ మాట్లాడుతూ యువతలోని ప్రతిభను గుర్తించి వారికి మరిన్ని అవకాశాలు కల్పించడమే యువజనోత్సవాల లక్ష్యమన్నారు. ఫోక్ డ్యాన్స్‌లో ద్రవిడియన్ యూనివర్సిటీ విద్యార్థుల బృందం, ఫోక్ సాంగ్‌లో సి. కుసుమ బృందం, వీధి నాటకంలో హరిప్రసాద్, పెయింటింగ్‌లో ఎన్. దుర్గా శ్రీ, కవితా రచనలో జి. హాసిక ప్రథమ బహుమతులు సాధించారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రథమ స్థానాల్లో నిలిచిన వారు రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో చిత్తూరు జిల్లా తరఫున పాల్గొననున్నారు.

# తిరుపతి ఎకనామిక్ రీజియన్ ప్లాన్-2047పై ప్రాంతీయ భాగస్వాముల సంప్రదింపుల సదస్సు

**తిరుపతి ఆర్థిక ప్రాంత ప్రణాళిక-2047 రూపకల్పనకు క్షేత్రస్థాయి సూచనలే కీలకం**

**పారిశ్రామిక, లాజిస్టిక్స్, పర్యాటక, వ్యవసాయ, సేవా రంగాల సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ**

**అభివృద్ధి అంతరాలను గుర్తించి 50-60 కీలక ప్రాజెక్టుల రూపకల్పనకు చర్యలు**

**భాగస్వాముల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించడమే లక్ష్యం: ముఖేష్ కుమార్ మీనా, సీఈఓ, తిరుపతి ఎకనామిక్ రీజియన్**




తిరుపతి, సెప్టెంబర్ 30, : స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్య సాధనలో భాగంగా తిరుపతి ఎకనామిక్ రీజియన్ ( ప్రణాళిక--2047



రూపకల్పనకు క్షేత్రస్థాయి భాగస్వాముల సూచనలు, సలహాలు ఎంతో కీలకమని తిరుపతి ఎకనామిక్ రీజియన్ సీఈఓ ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి కలెక్టరేట్ వీసీ హాల్లో తిరుపతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిపై తిరుపతి, చిత్తూరు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల భాగస్వాములతో ఒకరోజు సంప్రదింపుల సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి ఎకనామిక్ రీజన్ సీఈఓ ముఖేష్ కుమార్ మీనాతో పాటు ప్రణాళికా శాఖ జాయింట్ సెక్రటరీ అనంత శంకర్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు (తిరుపతి), గాలి భాను ప్రకాష్ (నగరి), నెలవల విజయశ్రీ (సూళ్లూరుపేట), కోనేటి ఆదిమూలం (సత్యవేడు), నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ పాల్గొన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివ శంకర్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, సీపీఓ రాజశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, నిపుణులు, కేపీఎంజీ ప్రతినిధులు హాజరయ్యారు.

**సదస్సులోని ముఖ్యాంశాలు:**

**భాగస్వామ్య ఆధారిత ప్రణాళిక తిరుపతి ఎకనామిక్ రీజన్ సీఈఓ ముఖేష్ కుమార్ మీనా):**

ఈ ప్రణాళికను కేవలం డేటా సేకరణకే పరిమితం చేయకుండా ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, నిపుణుల ప్రత్యక్ష సూచనలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి--నెల్లూరు ప్రాంతాల్లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ , తయారీ, టెస్టింగ్, లాంచ్ సదుపాయాలను అనుసంధానిస్తూ సమగ్ర స్పేస్, డిఫెన్స్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. 2,500 ఎకరాల్లో అభివృద్ధి చెందుతున్న స్పేస్ సిటీలో భూకేటాయింపులు ప్రారంభమయ్యాయని, ఐఐటీ, ఐఐఆర్ భాగస్వామ్యంతో ఆర్ అండ్ డీ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోర్టులు, విమానాశ్రయాలు, పరిశ్రమలను అనుసంధానించే సింగిల్ బాండెడ్ కారిడార్ ద్వారా రవాణా వ్యయం, సమయాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు.

**ఆర్థిక స్థితిగతుల సమీక్ష (ప్రణాళికా శాఖ జాయింట్ సెక్రటరీ అనంత శంకర్):**

ఈ ప్రాంతంలోని 9 జిల్లాలు రాష్ట్ర వైశాల్యంలో సగానికి పైగా ఉన్నప్పటికీ రాష్ట్ర జీఎస్డీపీలో వాటి వాటా దాదాపు మూడో వంతు మాత్రమే ఉందని తెలిపారు. సహజ, మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా విశాఖ, అమరావతి రీజియన్ల తరహాలోనే టీఈఆర్ ద్వారా భారీ ఆర్థిక ప్రగతి సాధించే అవకాశం ఉందన్నారు.

**రోడ్డు, రవాణా అనుసంధానం (తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్):**

తిరుపతి పరిసరాల్లో సుమారు 15 వేల ఎకరాల పారిశ్రామిక విస్తీర్ణం అందుబాటులో ఉందని, పరిశ్రమల విస్తరణకు బలమైన రహదారి అనుసంధానం అవసరమని తెలిపారు. చిత్తూరు--తచ్చూరు ఎక్స్‌ప్రెస్‌వే, బెంగళూరు--చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే, శ్రీసిటీ, కోల్‌కతా--చెన్నై జాతీయ రహదారులను కలిపే లింక్ రోడ్లతో పాటు శ్రీకాళహస్తి--తడ రహదారి అభివృద్ధి అత్యంత కీలకమన్నారు.

**నైపుణ్యాభివృద్ధి - విద్యుత్ మౌలిక వసతులు (నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా):**

బీపీసీఎల్, రక్షణ తయారీ, పోర్టు ఆధారిత పరిశ్రమలకు అనుగుణంగా వెల్డింగ్, సోలార్ వేఫర్స్ తయారీ, డ్రోన్ టెక్నాలజీ, క్రేన్ ఆపరేషన్ వంటి రంగాల్లో స్థానిక యువతకు ముందస్తు శిక్షణ అందించాలని సూచించారు. బీపీసీఎల్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటవుతుందని తెలిపారు. అలాగే గ్రీన్ హైడ్రోజన్, డేటా సెంటర్ల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణపట్నం, రామాయపట్నం ప్రాంతాల్లో ముందస్తు విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల పనులు చేపట్టాలన్నారు.

**పారిశ్రామిక భూములు - పెట్టుబడులు (చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్):**

చెన్నై మార్కెట్‌కు సమీపంగా ఉండటం జిల్లాకు పెద్ద అనుకూలత అని, జిల్లాలో పారిశ్రామిక పార్కుల కోసం 2,000--2,500 ఎకరాల భూమి అందుబాటులో ఉందని తెలిపారు. గత రెండేళ్లలో మరో 476 ఎకరాలు సేకరించామని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్, గార్మెంట్, పౌల్ట్రీ పరిశ్రమల్లో అవసరమైన మానవ వనరులకు పరిశ్రమల భాగస్వామ్యంతోనే శిక్షణ ఇవ్వాలని సూచించారు.

**యువతకు ఉపాధి - స్వయం ఉపాధి (ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్):**

డిగ్రీ, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు రెండో ఏడాది నుంచే పరిశ్రమలతో అనుసంధానం, ఇంటర్న్‌షిప్‌లు, స్టార్టప్ అవగాహన కల్పించాలని సూచించారు. తిరుపతి ప్రాంతంలో హోమ్‌స్టేలను ప్రోత్సహించడం ద్వారా యువతకు స్వయం ఉపాధి కల్పించవచ్చని తెలిపారు.

**ప్రజాప్రతినిధుల సూచనలు:**

**తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు:**

తిరుపతి, తిరుమలతో పాటు శ్రీకాళహస్తి, కాణిపాకం పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ భక్తులు 2--3 రోజులు బస చేసేలా టెంపుల్ టూరిజం సర్క్యూట్‌ను విస్తరించాలని, ఎలక్ట్రానిక్స్, ఈవీ, ఎంఎస్ఎంఈ పార్కులను ప్రోత్సహించాలని కోరారు.

**సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ:**

ఇరకం ఐలాండ్, పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల కేంద్రం, శ్రీహరికోటలను కలుపుతూ పర్యావరణ అనుమతులతో సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు.

**సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం:**

శ్రీసిటీ పారిశ్రామిక ట్రాఫిక్ దృష్ట్యా బైపాస్ రహదారి నిర్మించాలని, సత్యవేడు సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, సరిహద్దు ప్రాంత మౌలిక వసతులు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్: నగరి నియోజకవర్గంలో పారిశ్రామిక అవసరాలకు అందుబాటులో ఉన్న దాదాపు 5,000 ఎకరాల భూమిని పూర్తి మౌలిక వసతులతో అభివృద్ధి చేసి పరిశ్రమలను ఆకర్షించాలని సూచించారు.

**పర్యావరణ నిబంధనలు (అటవీ శాఖ):**

పులికాట్ ప్రాంతంలో ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు వన్యప్రాణి అభయారణ్య నిబంధనలను, కేంద్ర ప్రభుత్వ అనుమతులను తప్పనిసరిగా పాటించాలని, చిలికా సరస్సు అభివృద్ధి నమూనాను అధ్యయనం చేయవచ్చని అధికారులు పేర్కొన్నారు.

**కేపీఎంజీ కార్యాచరణ:**

రాష్ట్ర ప్రణాళికలో భాగంగా ఏరోస్పేస్, సెమీకండక్టర్లు, షిప్‌బిల్డింగ్, పునరుత్పాదక ఇంధనం, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు కీలకంగా మారనున్నాయని, జిల్లా లోటుపాట్లను సరిచేస్తూ 50--60 యాంకర్ ప్రాజెక్టులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. సదస్సు ముగింపులో కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ, సదస్సులో వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను అత్యుత్తమ అభివృద్ధి ప్రాంతంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. సదస్సు విజయవంతానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, కేపీఎంజీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



# లింక్ కెనాల్ ద్వారా రైతులకు న్యాయం చేయండి



గద్వాల్ (శివసూర్య ): చిన్నోనిపల్లి లింక్ కెనాల్ ను ఆర్ డి ఎస్ సింధనూర్ 43.85 కిలోమీటర్ వద్ద కలపండి. కలెక్టర్ ,ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్లకు వినతిపత్రం ఇచ్చిన సింధనూర్ సర్పంచ్. అయిజ మండలంలోని ఆర్ డి ఎస్ కెనాల్ కు చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి కలిపే లింక్ కెనాల్ ను 43.85 12వ వద్ద కిలోమీటర్ వద్ద కలపాలని సర్పంచ్ ఇంద్రసేన గౌడ్, బుధవారం వినతిపత్రం ఇచ్చారు. లింక్ కెనాల్ ఏర్పాటు సర్వే కోసం మంగళవారం ఇరిగేషన్ అధికారులు రావడంతో సింధనూర్, తొత్తినోనిదొడ్డి, కుట్కనూర్, కొత్తపల్లి రైతులు అభ్యంతరం చెప్పారు. ఇప్పటికే అధికారులు ఆర్ డి ఎస్ లోకి లింక్ కెనాల్ ను 45.03 12వ కింద కిలోమీటర్ వద్ద కలిపేందుకు నిర్ణయించారు. ఈ విధంగా చేయడంతో నాలుగు గ్రామాల రైతులకు చెందిన 1500 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం లేదు. అందువల్ల ఇరిగేషన్ అధికారుల అలైన్ మెంట్ ను మార్చి రైతులకు చిన్నోనిపల్లి లింక్ కెనాల్ ద్వారా సాగునీరు అందే అవకాశం ఉన్న 12వ డిస్ట్రిబ్యూటర్ వద్ద కలపాలని ఆర్ డి ఎస్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డి, ఉప్పల ప్రహల్లాధ రెడ్డి, ఉప్పల్ సర్పంచ్ తిమ్మోతి, సింధనూర్ జనార్ధన్ గౌడ్, లతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయంపై కలెక్టర్, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సానుకూలంగా స్పందించి 12వ రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# ఎస్ ఐ ఆర్ పేరుతో ఓటర్లకు ప్రమాదం:కాంగ్రెస్



తిరుపతి, సెప్టెంబర్ 30, : ఎస్ ఐ ఆర్ పేరుతో ఏకపక్షంగా లక్షలాది ఓట్లను తొలగిస్తున్నారంటూ నిరసిస్తూ తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌కు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమం డిసిసి అధ్యక్షులు బాల గురవబాబు ఆధ్వర్యంలో జరగగా, అందులో 7 నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సూళ్లూరుపేట హోలీ క్రాస్ ప్రాంతం నుంచి ఇన్‌ఛార్జ్ డి. కిరణ్ కుమార్ నేతృత్వంలో సుమారు 200 మందితో భారీ కాన్వాయ్‌గా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారని నాయకులు మండిపడ్డారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ పిలుపు మేరకు, వైఎస్ షర్మిలమ్మ ఆదేశాలతోనే ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళు తున్నామని కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. ఓటర్ల హక్కులను కాలరాస్తున్న ఈ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని కాంగ్రెస్ నేతలు గట్టిగా డిమాండ్ చేశారు. అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిని తక్షణమే అరెస్టు చేయాలని కూడా వారు కోరారు. జిల్లాల్లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ నిరసన స్వరాన్ని వినిపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పునరుద్ధరించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన శ్రేణులతో కలెక్టరేట్ పరిసర ప్రాంతాలు కాంగ్రెస్ నినాదాలతో హోరెత్తాయి.

# స్థానిక వైఎస్ఆర్సిపి నేతలను కలసిన తగ్గువారిపల్లి యువ నాయకుడు జగదీష్

చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం సెప్టెంబర్ 30. : చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం తగువారిపల్లె పంచాయతీకి చెందిన యువ నాయకుడు కె. జగదీష్ జిల్లా యువజన విభాగం నూతన కార్యదర్శిగా వైఎస్ఆర్సిపి పార్టీ నియమించినందుకు బుధవారం మండల కన్వీనర్ పాలేరు రామచంద్ర రెడ్డి, మండల వైస్ ఎంపీపీ శిరీస్ రెడ్డిలను తగ్గువారిపల్లి పంచాయతీకి చెందిన తన అనుచరులతో కలిసి జగదీష్ శుభాకాంక్షలు తెలియజేశారు. యువ నాయకుడు కె. జగదీష్ పార్టీకి అందించిన సేవలను గుర్తించి చిత్తూరు జిల్లా యువజన విభాగం కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ రామచంద్ర రెడ్డి, మండల వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి లకు జగదీష్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా యువజన విభాగం కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన డాక్టర్ ఎం.సునీల్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, తగ్గువారి పల్లి ఇంచార్జ్ షాకీర్, ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి రఘుపతి రాజు, మైనార్టీ నాయకులు ఖాదర్బాషా, ఎక్స్ ఎంపీటీసీ హేమచంద్ర, మండల సెక్రెటరీ ముబారక్, ఆటో వంశీ, తగువారి పల్లి యూత్ లీడర్ మనీ, తగ్గవారిపల్లి విలేజ్ సెక్రటరీ ప్రదీప్, విలేజ్ యూత్ వింగ్ జనరల్ సెక్రెటరీ కె బద్రి, మండల్ యూత్ మెంబర్ మంజు, సోషల్ మీడియా విన్ సెక్రెటరీ అష్రాఫ్, తగ్గు వారి పల్లి బీసీ నాయకులు వినోద్, తగ్గువారిపల్లి యువ నాయకుడు సాగర్, తగ్గువారిపల్లి యూత్ నెంబర్ కౌశిక్, నాగభూషణ. జగదీష్‌ను అభినందించి, నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## “గ్లోబల్ టూరిజం అని బిల్డప్.. తీరా చూస్తే పరువు పాయే”




కోల్‌కతా: కొన్ని సార్లు మనం ఏదో గొప్పగా చేయాలనుకున్న పనే మనకు ఇబ్బందులు తెచ్చిపడుతుంది. తాజాగా బెంగాల్ సీఎం సువేందు అధికారి పరిస్థితి అలానే ఉంది. బెంగాల్ టూరిజంను ప్రపంచస్థాయిలో డెవలప్ చేద్దామనుకొని అన్ని హంగులతో ఒక నిమిషం నిడివి గల వీడియోని రూపొందించారు. అయితే అదే ఇప్పుడు ట్రోలింగ్‌కు గురవుతుంది. అసలు ఈ టూరిజం వీడియోల బెంగాల్ ఎక్కడుందంటూ నెటిజన్స్ ఆయనను తీవ్రంగా ట్రోల్ చేస్తున్నారు. ఇటీవల వెస్ట్ బెంగాల్ సీఎం సువేందు అధికారి రాష్ట్రంలోని పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ. 500 కోట్ల నిధులను ప్రకటించారు. అంతేకాకుండా నిన్న (శుక్రవారం) బెంగాల్ సాంస్కృతిక వారసత్వాన్ని భారతదేశం భిన్నంగా భావించే చోటు’ అనే క్యాచ్‌లైన్‌తో ఒక లోగోనుఎంతో ఆర్భాటంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా సువేందు మాట్లాడుతూ” మనం మన రాష్ట్రంలో పర్యాటక మౌలిక సదుపాయాలను నాశనం చేశాం. పర్యాటకులు మన రాష్ట్రంలోని డార్జిలింగ్, కాలింపాంగ్ మీదుగా సిక్కింకు వెళతారు. దీనిని మార్చడానికి మేము నిశ్చయించుకున్నాము,” అని అన్నారు. అయితే ఈ సందర్భంగా విడుదల చేసిన వీడియో ఇప్పుడు ఆయనకు తలనొప్పిగా మారింది. బెంగాల్ టూరిజం వీడియోలో.. ఈఫిల్ టవర్, రష్యాలోని సెయింట్ బాసిల్ కేథడ్రల్, పిరమిడ్లు, రియోలోని క్రైస్ట్ ది రిడీమర్ ఉన్నాయి. బెంగాల్‌కు చెందిన ప్రసిద్ధ హౌరా వంతెన మాత్రమే అలా వచ్చి వెళ్లిపోతుంది. దీంతో ఇది చూసిన నెటిజన్స్ ఇక్కడ అసలు బెంగాల్ ఎక్కడ ఉంది అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అసలు ఇందులో బెంగాల్‌కు సంబంధించిన ప్రదేశాలు ఎక్కడున్నాయని ప్రశ్నిస్తున్నారు.

### పొలిటికల్ సెటైర్స్

అయితే ఈ టూరిజం వీడియోపై స్వంత పార్టీలోనే తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. బీజేపీ సీనియర్ నేత త్రిపుర, మేఘాలయ మాజీ గవర్నర్ తథాగత రాయ్ దీనిపై తీవ్ర విమర్శలు చేశారు. ఇది “మూర్ఖపు” “అనుభవం లేని వీడియో” అని అభివర్ణించారు. వెంటనే దానిని తొలగించాలని డిమాండ్ చేశారు. “పశ్చిమ బెంగాల్‌పై తీసిన వీడియోలో మాస్కో, ఈజిప్ట్, రియో ??డి జనీరో దృశ్యాలు ఎందుకు ఉండాలి?” అని ప్రశ్నించారు. దీనిని రూపొందించిన వ్యక్తిని మత్స్యశాఖకు లేదా అలాంటి మరేదైనా విభాగానికి బదిలీ చేయాలని నేను సూచిస్తున్నాను అని వ్యంగ్యంగా మాట్లాడారు. టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రెయన్ “ఈ వీడియోకు ‘చెత్త’ అనే పదం కూడా చాలా తక్కువైనది అని ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు.

## ‘మూడు పార్టీలు కలిసి ఉన్నా పోటీకి భయపడుతున్నాయి’



చోడవరం(అనకాపల్లి జిల్లా): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి కూటమి భయపడుతుందన్నారు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత గుడివాడ అమర్నాథ్. కూటమిలో మూడు పార్టీలు కలిసి ఉన్నా పోటీ చేయడానికి భయపడుతున్నాయన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పోటీకి దిగుతుందని స్పష్టం చేశారాయన. చంద్రబాబులా వైఎస్ జగన్ తప్పించుకునే ప్రయత్నం ఎప్పుడూ చేయలేదన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు తప్పించుకునే ప్రయత్నం చేశారని, ఆ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయడం లేదని ప్రకటించారన్నారు. ప్రజా సమస్యలు మీద వైఎస్సార్‌సీపీ అలుపెరగని పోరాటం చేస్తుందని, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందన్నారు. చోడవరం, షుగర్ ఫ్యాక్టరీ రైతులకు రూ. 30 కోట్లు, ఉద్యోగులకు రూ. 5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఇది దేవుడు చెప్పిన సత్యం: బొత్స



అనకాపల్లి: చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా కరువేనని.. ఇది దేవుడు చెప్పిన సత్యం అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. అనకాపల్లి జిల్లాలో ఎక్కడ చూసినా మైనింగ్ జరుగుతుంది. ఏపీ గంజాయి మత్తులో తూగుతోంది. వాస్తవాలను చెబుతున్నప్పుడు సోషల్ మీడియా అకౌంట్లు బ్లాక్ చేసే అధికారం ఎవరిచ్చారు?” అంటూ బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. “వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు పదివేలకు పైగా డీఎస్సీ ఉద్యోగాలు ఇచ్చాము. సుమారు లక్షల 50 వేల సచివాలయ ఉద్యోగాలు భర్తీ చేశాం. ఎక్కడైనా మాపై ఒక చిన్న ఆరోపణ వచ్చిందా? ఎక్కడైనా డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చినట్లు ఆధారాలు లభించాయా?. వైఎస్ జగన్ పాలనలో ఉద్యోగాల భర్తీ పారదర్శకంగా జరిగింది. కూటమి పాలనలో స్పోర్ట్స్ కోటాలో పరీక్ష లేకుండా ఉద్యోగాలు ఇచ్చారు. ఉద్యోగాలు ఇవ్వడం కోసం ఒక జీవో తీసుకువచ్చారు. ఉద్యోగాలు ఇచ్చిన తర్వాత ఆ జీవోను రద్దు చేశారు” అంటూ బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీలో ఉద్యోగాల కోసం బేరాలు పెట్టారు. శాసనమండలిలో చర్చకు రమ్మంటే తోక ముడిచి పారిపోయారు. విశాఖ నగరాన్ని సర్వనాశనం చేశారు. గీతం యూనివర్సిటీకి వేల కోట్లు చేసే భూములు అప్పగించారు. ఎవడబ్బ సొమ్ము అని 3 వేల కోట్లు ధారాదత్తం చేస్తారు?. గ్రావిటీ ద్వారా పోలవరం ఎడమ కాలువకు నీరు ఇవ్వాలి. ఉత్తరాంధ్ర సుజల ప్రవంతి ద్వారా శ్రీకాకుళం చివరికి నీరు ఇవ్వాలి. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా నీరు ఇచ్చి గోదావరి జలాలు ఇచ్చామని ప్రచారం చేస్తారా?. పోలవరం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది వైఎస్సార్.. అందుకు నేను సాక్ష్యం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలి గెలిచి తీరాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా చంద్రబాబులా పారిపోయే మనస్తత్వం వైఎస్ జగన్‌ది కాదు” అని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

## కేబినెట్ విస్తరణపై మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్: తెలంగాణలో కేబినెట్ విస్తరణ అంశం, కొండా సురేఖ ఎపిసోడ్‌పై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్టు ఆయన చెప్పుకొచ్చారు. అలాగే, కేబినెట్ విస్తరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇష్టానుసారం జరుగుతుందని తెలిపారు. మీడియా చిట్ చాట్‌లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..‘కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లే. ఢిల్లీలో కేబినెట్ విస్తరణపై చర్చ జరగలేదు. కేవలం కొండా సురేఖ, చిన్నా రెడ్డి అంశంపై మాత్రమే చర్చ జరిగింది. కేబినెట్ విస్తరణపై హై కమాండ్ నుండి ఎలాంటి సమాచారం లేదు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం. నాకు మంత్రి పదవి అనే ప్రచారంపై నాకు మాత్రం సమాచారం లేదు. అవన్నీ ఊహాగానాలే. అలాగే, కొండా సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించాం. సురేఖ విషయంలో అందరం మా వంతు ప్రయత్నం చేశాం. సురేఖ విషయంలో ఏఐసీసీ ఒప్పుకోలేదు అంటూ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని రేవంత్ నెరవేర్చారు. కుల సర్వే శాస్త్రీయంగా చేశాం. రాబోయే వంద రోజులు దేశవ్యాప్తంగా బీసీ హక్కుల గర్జన చేస్తాం. బీసీ హక్కుల కోసం జరిగే గర్జనను విజయవంతం చేయండి’ అని పిలుపునిచ్చారు. మరోవైపు.. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బండి సంజయ్, అరవింద్, ఈటల, లక్ష్మణ్ బీసీల అంశంపై స్పందించాలి. అడిగితే పదవులు పోతాయని బీజేపీ బీసీ నేతలు భయపడుతున్నారా?. తెలంగాణలో బీజేపీ ఉండాలా వద్దా తేల్చుకోండి. కుల గణనలో దేశానికి రోల్ మోడల్‌గా ఉన్నాం. తెలంగాణ చేసిన కులగణనలో అన్ని విషయాలు పొందుపరిచాం. మేం పంపిన ఫైల్‌పై కేంద్రం ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. ఓబీసీల జనాభాను ఎందుకు లెక్కించడం లేదు? అని ప్రశ్నించారు.

# జెన్-జీలోనూ మొహమాటపు పోకడలు!

## కెరీర్‌కు సాయపడేవారినీ కలవడం లేదు రకరకాల మొహమాటాలు లింక్డిన్ నివేదిక



జెన్--జీ అంటే కేర్‌ఫ్రీ అనుకుంటున్నాం కానీ వారిలోనూ ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో అనే మొహమాటం ఉన్నట్లు తాజా అధ్యయనం స్పష్టం చేసింది. ఈ మొహమాటం కారణంగా వారు కెరియర్‌లో ఎదిగేందుకు సాయపడగల వ్యక్తులను సంప్రదించడం లేదని, నెట్‌వర్కింగ్‌కు ఆసక్తి చూపడం లేదని లింక్డ్ఇన్ జరిపిన ఈ అధ్యయనం తెలిపింది. బుధవారం విడుదలైన ఈ నివేదిక ప్రకారం నిత్యం ఆన్‌లైన్‌లోనే ఉండే తరానికి చెందిన జెన్--జీ ప్రొఫెషనల్స్‌లో 83 శాతం మంది ఈ రకమైన పోకడలు చూపుతున్నట్లు తెలిసింది. జడ్జ్ చేస్తారేమో అన్న సంకోచం 44 శాతం మందిని పీడిస్తూంటే.. ఇతరులకు ఇబ్బంది కలుగుతుందేమో అన్న మొహమాటంతో 39 శాతం మంది సాయపడే వారికి దూరంగా ఉంటున్నారట. మరీ కృతకంగా ఉంటుందేమో అన్న అనుమానంతో ఇతరుల సలహాలు కోరడం, రిలేషన్‌షిప్‌ను మెయిన్‌టెయిన్ చేయడం, కొత్త అవకాశాలను అందుకోవడం వంటివి చేయని వారు సుమారు 37 శాతం మంది ఉన్నట్లు ఈ నివేదిక తెలిపింది. భారత్‌తోపాటు యూకే, యూఎస్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్, సింగపూర్, బ్రెజిల్, యూఏఈ, సౌదీ అరేబియాల్లో ఈ ఏడాది జూలై 20వ తేదీ నుంచి ఆగస్టు 11వ తేదీ వరకూ దాదాపు 18,050 మంది పార్ట్‌టైమ్ ఉద్యోగుల (18 -- 80 ఏళ్ల వారు)ను ప్రశ్నించడం ద్వారా ఈ నివేదిక రూపుదిద్దుకుంది. భారత్ విషయానికి వస్తే... జెన్--జీలో 79 శాతం మందికి ప్రొఫెషనల్ రిలేషన్‌షిప్స్ అవసరం, ప్రాముఖ్యత గురించి తెలుసు. కానీ సంగం కంటే ఎక్కువ మంది (53 శాతం) వీటిని ఎలా మొదలుపెట్టాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. మరోవైపు 53 శాతం మంది పరిచయస్తులను (కాంటాక్ట్‌లు) అసలైన కనెక్షన్స్‌గా మార్చుకోవడం ఎలాగో తెలియక ఇబ్బంది పడుతున్నారు. దీనికి ఖర్చులవుతాయన్న ఆందోళన అదనం. లింక్డ్ఇన్ డేటా ప్రకారం ఆయా కంపెనీల్లో ఎవరైనా తెలిసి ఉంటే ఇతరులతో పోలిస్తే ఉద్యోగాలు వచ్చే అవకాశాలు దాదాపు 8.5 రెట్లు ఎక్కువ. అయితే, జెన్--జీలో సుమారు 59 శాతం మందికి ప్రొఫెషనల్ రిలేషన్‌షిప్స్ ఎలా పెంపొందించుకోవాలో ఎవరూ చెప్పలేదట. చాలామంది తమంతట తాము నేర్చుకోవడమో.. లేక పరిమితమైన సలహా, సూచనల ద్వారా ముందుకెళ్లడమో చేశారని లింక్డ్ఇన్ నివేదిక చెబుతోంది. ఫలితంగా ఉద్యోగం కోసం లేదా వృత్తిలో ఎదిగేందుకు ఎవరిని సంప్రదించాలి? ఎప్పుడు సంప్రదించాలి? ఏం మాట్లాడాలి? వంటి విషయాలపై అవగాహన పెంచుకోవడం కష్టమవుతోందని తెలిపింది. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. జెన్--జీ ఈ సమస్యలు ఎదుర్కొంటూంటే మిలినియల్స్ (1981--1996 మధ్య పుట్టిన వారు), అంతకు ముందు తరం జెన్ ఎక్స్ (1965--1980 మధ్య పుట్టిన వారు) ఉద్యోగులు మాత్రం అప్పుడే ఉద్యోగాల్లోకి చేరిన అపరిచితులకు సైతం తాము సాయం చేస్తామని చెప్పడం విశేషం.

# పెద్దన్నా.. ఏంటీ కన్ఫ్యూజన్? ఆంక్షలా.. దాడులా?

ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వ్యూహం ఇప్పుడు అమెరికా రాజకీయాల్లో తీవ్ర గందరగోళానికి దారి తీసింది. ఒకవైపు ఇరాన్ ఆర్థిక వ్యవస్థను క్రమంగా ఉక్కిరిబిక్కిరి చేసేలా కఠిన ఆంక్షలు విధిస్తామని హెచ్చరిస్తున్న ట్రంప్.. మరోవైపు అవసరమైతే ఇరాన్‌పై భారీ సైనిక దాడులు తప్పవంటూ బెదిరిస్తున్నారు. ఆ వెంటనే అదో చిన్న యుద్ధమంటూ వ్యాఖ్యానించారు. అయితే ఈ విషయంలో పెద్దన్న వైఖరిలో స్పష్టత కనిపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ బలగాల సంయుక్త దాడితో పశ్చిమాసియా యుద్ధం మొదలైంది. అంటే ఆర్నెలు పూర్తయ్యిందన్నమాట. అయితే ఇరాన్‌పై అమెరికా తాజాగా మరోసారి సైనిక చర్యకు దిగింది. దాదాపు నెల రోజుల తర్వాత జరిగిన దాడి ఇది. హర్ముజ్ జలసంధిలో సముద్ర గనులను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొంటూ అమెరికా సైన్యం.. ఇరాన్ రాకెట్ లాంచర్లను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిపింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్ మరో అడుగు ముందుకేశారు. ఇరాన్ కీలక ఇంధన కేంద్రంగా ఉన్న ఖర్గ్ ద్వీపాన్ని ‘తునాతునకలు చేస్తాం’ అంటూ సోషల్ మీడియా వేదికగా ఓ ఏఐ వీడియోతో హెచ్చరించారు. అయితే దీనికి కొద్ది రోజుల ముందే అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ మరో వ్యూహాన్ని ప్రకటించారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసేలా కొత్త ఆంక్షలను అమలు చేయనున్నామని.. దీనిని ఆయన ‘ఆర్థిక డీ-డే’గా అభివర్ణించారు. ఈ ఆర్థిక ఒత్తిడి ద్వారా ఇరాన్‌ను చర్చల బాట పట్టించవచ్చని.. తద్వారా మరోసారి సైనిక ఉద్రిక్తతకు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన సంకేతాలిచ్చారు. ఇరాన్ యుద్ధం విషయంలో ట్రంప్ పట్ల ప్రజాదరణ క్రమంగా తగ్గిపోతున్నట్లు పలు సర్వేలు చెబుతున్నాయి. ఈ అటు ప్రత్యర్థి డెమోక్రట్లే కాదు.. ఇటు సొంత పార్టీ రిపబ్లికన్‌లోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

### ‘ఏ వ్యూహమో ఏమో.. ఏమీ అర్థం కావడం లేదు’

ఆరు వారాల్లో ముగుస్తుందని ట్రంప్ గతంలో చెప్పిన యుద్ధం.. ఆరు నెలలు దాటినా కొనసాగుతుండటం కూడా ప్రశ్నలకు తావిస్తోంది. ట్రంప్, ఆయన కేబినెట్ సభ్యులు పలుమార్లు ఈ యుద్ధం ముగిసిందని, అమెరికా విజయం సాధించిందని ప్రకటించినప్పటికీ.. ఇరాన్‌తో ఉద్రిక్తతలు మాత్రం పూర్తిగా చల్లారలేదు. ట్రంప్ వైఖరిలో తరచూ కనిపిస్తున్న ఈ మార్పులపై అమెరికా రాజకీయ వర్గాల్లో అసంతృప్తి పెరుగుతోంది. ట్రంప్ పాలనలోని విధానాలపై అవగాహన ఉన్న మాజీ భద్రతా అధికారి ఒకరు.. ఇరాన్‌పై యుద్ధం స్పష్టమైన ప్రణాళిక లేకుండానే ప్రారంభమైందని, ఇప్పటికీ పరిస్థితులకు అనుగుణంగానే నిర్ణయాలు మారుతున్నాయని వ్యాఖ్యానించారు.

ట్రంప్‌తో ఎవ్వరూ సంతృప్తిగా లేరా?

రిపబ్లికన్ పార్టీలో ఇరాన్ ఉద్రిక్తతలపై భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. యుద్ధం మరింత పొడిగితే చమురు ధరలు పెరిగి.. అమెరికన్లపై భారం పడుతుందని, వచ్చే మధ్యంతర ఎన్నికలపై ప్రభావం చూపొచ్చని కొందరు ఆందోళన చెందుతున్నారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సహా యుద్ధంపై అప్రమత్తంగా ఉన్న వర్గాలు సైతం సంఘర్షణ త్వరగా ముగియాలని కోరుకుంటున్నాయి. మరోవైపు ఇరాన్‌పై మరింత కఠినంగా వ్యవహరించాలని కోరుకునే హార్డ్‌లైన్ వర్గం కూడా ట్రంప్ తీరుపై పూర్తిగా సంతృప్తిగా లేదు. ట్రంప్ ప్రచార బృందంలో పని చేసిన ఓ మాజీ అధికారి మాట్లాడుతూ.. ఇరాన్‌ను అదుపులోకి తీసుకురావాలన్న ట్రంప్ లక్ష్యాన్ని సమర్థించే రిపబ్లికన్లు కూడా ప్రస్తుత పరిణామాలతో అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. మరో రిపబ్లికన్ వ్యూహకర్త ఈ పరిస్థితిని సరదాగా ‘ఫ్రెండ్లీ జోన్‌లో చిక్కుకున్నట్లుంది’ అంటూ అభివర్ణించారు. అంటే.. ట్రంప్ తీసుకుంటున్న ఏ నిర్ణయం కూడా పూర్తిగా ఏ వర్గాన్నీ సంతృప్తిపరచడం లేదన్నమాట.

### మధ్యంతర ఎన్నికల వేళ పెరుగుతున్న ఒత్తిడి

అమెరికాలో మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇరాన్ యుద్ధం ట్రంప్ ప్రభుత్వానికి రాజకీయంగా కూడా సవాలుగా మారుతోంది. ఇప్పటికే అధిక ధరలతో అమెరికన్లు ఇబ్బంది పడుతున్న సమయంలో.. హర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు చమురు సరఫరాపై ప్రభావం చూపితే పరిస్థితి మరింత కఠినంగా మారే అవకాశం ఉంది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్ముజ్ జలసంధి గుండా గతంలో ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు ఐదో వంతు రవాణా జరిగేది. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అమెరికాలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇప్పటికే ఆందోళన కలిగిస్తున్నాయి.

### ‘ఇది వ్యూహంలో భాగమే’

అయితే ట్రంప్ ప్రభుత్వానికి సన్నిహితంగా ఉన్నవారు మాత్రం ఈ పరిణామాలను మరోలా చూస్తున్నారు. ఇరాన్‌పై సైనిక, ఆర్థిక ఒత్తిడిని ఒకేసారి కొనసాగించడం ఉద్దేశపూర్వక వ్యూహమేనని వారు చెబుతున్నారు. ఒకవైపు హర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు పూర్తిగా నిలిచిపోకుండా ఒత్తిడి కొనసాగిస్తూ.. మరోవైపు ఆంక్షల ప్రభావం ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై పడే వరకు వేచి చూడాలన్నది ట్రంప్ వ్యూహంగా వారు పేర్కొంటున్నారు. మాజీ అమెరికా రాయబారి జేమ్స్ జెఫ్రీ కూడా తాజా పరిణామాలను ఇరువైపులా జరుగుతున్న ప్రతిచర్యలుగానే అభివర్ణించారు. ఇరాన్, అమెరికా రెండూ పూర్తిస్థాయి దాడులకు తిరిగి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నట్లు కనిపించడం లేదని పేర్కొన్నారు.

యుద్ధం త్వరగా ముగిస్తే మంచిది

ఇదిలా ఉండగా.. ట్రంప్ యంత్రాంగంలోనే యుద్ధాన్ని ముగించాలన్న అభిప్రాయం బలపడుతున్నట్లు చర్చ జరుగుతోంది. చమురు పరిశ్రమకు చెందిన ఓ ఉన్నతాధికారి ప్రకారం.. ఘర్షణలను ముగించాలన్న ఒత్తిడి భారీగా ఉంది. ఇరాన్ పూర్తిగా బలహీనపడే వరకు ఒత్తిడి కొనసాగించాలని భావించే అధికారులు కూడా ఉన్నారు. ఇరాన్‌ను తీవ్ర ఆర్థిక, సైనిక ఒత్తిడిలోకి నెట్టినప్పుడే అది అమెరికాతో తమకు అనుకూలమైన ఒప్పందానికి వస్తుందని వాళ్లు అభిప్రాయపడుతున్నారు.

ఇరాన్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు

అమెరికా విధిస్తున్న ఆంక్షలు తమను చర్చల బాట పట్టిస్తాయన్న వాదనను ఇరాన్ తీవ్రంగా ఖండిస్తోంది. అమెరికా వాదనలు అబద్ధాలంటూ ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘలీబాఫ్ విమర్శించారు. అమెరికా ఆంక్షల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చైనా కూడా ఇరాన్‌కు మద్దతుగా నిలుస్తోంది. ఇరాన్ నుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేసే చైనా.. అంతర్జాతీయ చట్టాలకు ఆధారం లేని ఏకపక్ష అమెరికా ఆంక్షలను వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. మొత్తంగా.. ఇరాన్‌పై ట్రంప్ ఒత్తిడి మాత్రం తగ్గడం లేదు. ఆర్థిక ఆంక్షలతో ఉక్కిరిబిక్కిరి చేయాలా? సైనిక దాడులతో లొంగదీసుకోవాలా? లేక ఒత్తిడితోనే చర్చల బాట పట్టించాలా? అన్నది మాత్రం స్పష్టంగా కనిపించడం లేదు. ఒకవైపు యుద్ధం ముగిసిందంటూనే.. మరోవైపు దాడుల హెచ్చరికలు చేయడం, ఆ తర్వాత మళ్లీ చర్చలకు సంకేతాలివ్వడం అమెరికా వ్యూహంపై సందేహాలకు తావిస్తోంది. ఇరాన్‌ను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై ట్రంప్ నిర్ణయం ఏదైనా కావొచ్చు.. కానీ యుద్ధాన్ని ఎప్పుడు, ఎలా ముగించాలన్నదే ఇప్పుడు ఆయన ముందున్న అసలు సవాలు!.

# ఆమె కన్నీటి శాపమే.. నేపాల్‌ను వెంటాడుతోందా?

ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడడం, భూకంపాలు.. వరుస ప్రకృతి విపత్తులు ఓవైపు తరచూ తలెత్తుతున్న రాజకీయ సంక్షోభాలు మరోవైపు. ఎప్పుడు ఏం జరుగుతుందో.. ఏ ముప్పు ఎటు నుంచి ముంచుకొస్తుందో తెలియని పరిస్థితులతో పశుపతి నేల నేపాల్ సతమతమవుతోంది. తాజా జల విలయం కూడా ఆ దేశం ఎదుర్కొంటున్న కష్టాలను మరోసారి కళ్లకు కట్టింది. ఇలాంటి పరిస్థితులు తమకు బాగా అలవాటేనని, కోలుకోవడం కూడా సాధారణమేనని నేపాల్ చెబుతున్నప్పటికీ.. ఈ పరిస్థితుల వెనక ప్రచారంలో ఉన్న ఓ గాథ తాజాగా తెరపైకి వచ్చింది. ‘సతి లే సరాపేకో దేశ్’.. సతి శాపానికి గురైన దేశం. నేపాల్ రాజకీయాల్లో తరచూ వినిపించే మాట ఇది. రాజరికం అంతరించి పోయిన సమయంలో.. అలాగే వరుసగా ప్రభుత్వాలు కూలినప్పుడల్లా ఈ పదం నెట్టింట వైరల్ అవుతుంటుంది. ఇది కేవలం ఇందుకే పరిమితం కాలేదు.. ప్రకృతి ప్రకోపం చూపించినప్పుడు కూడా అక్కడి జనాలు దీనిని గుర్తు చేసుకుంటారు. అసలు నేపాల్ శపించిన ఆ మహిళ ఎవరు? ఆమె విషాద గాథ ఏంటి? సతీసహగమన సమయంలో ఆమె పెట్టిన కన్నీరే నేపాల్ దుస్థితికి కారణమా?.. నాలుగు వందల ఏళ్ల కిందట జరిగింది ఏంటి?.. నేపాల్‌లో 17వ శతాబ్దంలో ఖాట్మండు లోయను మల్ల రాజులు పరిపాలించేవారు. అధికారం, ఆధిపత్య పోరులతో రాజదర్బాలు కుట్రలకు, కుతంత్రాలుగా నిలయంగా కనిపించేవి. ఆ వంశంలో రాజు లక్ష్మీ నరసింహ మల్లా కొలువులో కాజీ భీమ్ మల్లా అనే సేనాపతి ఉండేవాడు. సైనిక వ్యవహారాల్లోనే కాకుండా పరిపాలన, టిబెట్‌తో వాణిజ్య సంబంధాల్లోనూ ఆయన రాజుకు చేదోడు వాదోడుగా ఉంటూ కీలక వ్యక్తిగా ఎదిగారు. రాజు వద్ద ఆయనకు పెరుగుతున్న ప్రాధాన్యం.. సాధారణంగానే సామంత రాజుల్లో అసూయను పెంచింది.

### చాడీలు విని..

భీమ్ మల్లాపై కుట్రలు పన్నిన ప్రత్యర్థులు.. రాజు లక్ష్మీ నరసింహుడికి లేనిపోని వన్నీ నూరిపోశారు. దాంతో తన సింహాసనానికి భీమ్ ముప్పుగా మారుతున్నాడేమో అని అనుమానం పెంచుకున్నారాయన. అలా రాజద్రోహం ఆరోపణలతో ఎలాంటి విచారణ జరపకుండానే ఆయన్ని చెరసాలలో బంధించి.. మరణశిక్ష అమలు చేశారు. అది చూసి.. ఆయన భార్య భువనలక్ష్మి గుండె పగిలేలా రోదించింది. రాజ్యం సైతం కన్నీరు పెట్టింది.




### చితిపై నుంచే శాపం?

నమ్మిన బంటుగా ఉన్న వ్యక్తిని లక్ష్మీ నరసింహుడు అకారణంగా, కుట్రలకు తలొగ్గి చంపడాన్ని భువనలక్ష్మి తట్టుకోలేకపోయారు. ఆ కాలంలో నేపాల్‌లో సతి ఆచారం ఉండేది. భర్త మరణించిన తర్వాత భార్య కూడా అతడి చితిపై ఆత్మాహుతి చేసుకునే పరిస్థితులు ఉండేవి. భువనలక్ష్మి కూడా భర్త భీమ్ మల్లా చితిపై ఆత్మార్పణం చేసుకున్నారు. అయితే అంతకు ముందు తన భర్తకు జరిగిన అన్యాయంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్తను అన్యాయంగా చంపిన ఈ నేల, ఈ రాజ్యాన్ని మనశ్శాంతిగా ఉండబోవని, సర్వనాశనం అవుతాయని శపించారు. ఆ తర్వాత రాజు లక్ష్మీ నరసింహుడు సైతం తన పశ్చాత్తాపం వ్యక్తం చేశాడని.. ఆయన కాలంలోనే వరదలు సంభవించాయని చెబుతుంటారు. అలా ఆమె శాపం నాలుగు వందల ఏళ్లుగా కొనసాగుతూనే ఉందని ఓ జానపద కథ ప్రచారంలోకి వచ్చింది. ఆ గాథ నుంచే ‘సతి లే సరాపేకో దేశ్’(ఝఛ్ఱ శ్రీవ ఝఙతీఝజూవ ఎశీ ఐవంప్త్ర) అనే పదబంధం పుట్టిందని చెబుతారు. అయితే కాలక్రమంలో ఈ గాథ భువనలక్ష్మి అనే మహిళ కన్నీటి కథకు మాత్రమే పరిమితం కాలేదు. నేపాల్‌లో తరచూ తలెత్తిన రాజకీయ అస్థిరత, అధికార పోరాటాలు, పాలనా సంక్షోభాలు.. అదనంగా ముంచెత్తున్న ప్రకృతి విపత్తులను ప్రస్తావించేటప్పుడు ఈ పదబంధాన్ని వ్యంగ్యంగా, ఆవేదన పూరితంగా ఉపయోగించడం మొదలైంది. ఇప్పుడు ఆకస్మిక వరదల వల్ల మళ్లీ తెరపైకి వచ్చింది.

శివసూర్య
RNI APTEL : 2023/88704
తెలుగు దిన పత్రిక
గురువారం - 01 - అక్టోబర్ - 2026

# గాలి కాలుష్యంతో బ్రెయిన్ స్ట్రోక్



బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాన్ని గాలి కాలుష్యం పెంచుతున్నది. ఏటా లక్షల మంది ప్రాణాలను తీస్తున్నదని 2024 బయోమెడ్ సెంట్రల్ (బీఎంసీ) పబ్లిక్ హెల్త్ అధ్యయనం వెల్లడించింది. వాయు కాలుష్యం వల్ల ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఇరవై లక్షల మంది స్ట్రోక్ బారిన పడుతున్నట్లు ఈ సర్వే తేల్చింది. భారతదేశంతో సహా తక్కువ, మధ్య ఆదాయ దేశాలలో సంభవించే నాలుగు బ్రెయిన్ స్ట్రోక్ మరణాలలో.. ఒకటి గాలి కాలుష్యం వల్లేనని కనుగొన్నది. ముఖ్యంగా.. నగరాలు, పట్టణ ప్రాంత యువకులు ఎక్కువగా దీని బారిన పడుతున్నట్లు వెల్లడైంది. పీఎం 2.5 వంటి సూక్ష్మ కణాలు.. ఊపిరితిత్తుల రక్షణ వ్యవస్థను దాటుకొని రక్తప్రవాహంలోకి ప్రవేశిస్తున్నాయట. రక్త నాళాల్లో అడ్డంకులు సృష్టించి.. బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణం అవుతున్నాయని అధ్యయనకారులు చెబుతున్నారు. మన దేశంలో మూడు దశాబ్దాలుగా బ్రెయిన్ స్ట్రోక్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. గాలి కాలుష్యం వల్ల స్ట్రోక్ బారిన పడుతున్నవారిలో యువతే ఎక్కువగా ఉంటున్నదట. దాదాపు 20-30 శాతం స్ట్రోక్‌లు 50 ఏళ్లలోపు వారిలోనే సంభవిస్తున్నాయట. వీరిలో ప్రాణాలతో బయటపడిన వారిలో 50 శాతం మంది శాశ్వత వైకల్యాలతో మిగిలిపోతున్నారట. ఈ పరిస్థితిని తప్పించుకోవాలంటే.. ఆకస్మికంగా బలహీనమవ్వడం, మాటలు తడబడటం, ముఖం వాలిపోవడం, శరీరం సమతుల్యత కోల్పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు. ఇక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుకోవడంతోపాటు ధూమపానం మానేయడం, చురుకైన జీవనశైలి, గాలి కాలుష్యానికి దూరంగా ఉండటం, ఎయిర్ ప్యూరిఫైయర్‌లను ఉపయోగించడం వల్ల స్ట్రోక్ ప్రమాదం నుంచి బయట పడొచ్చని చెబుతున్నారు.

## 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు కచ్చితంగా రోజూ వీటిని తినాలి.. వృద్ధాప్యంలో ఎంతో మేలు జరుగుతుంది..!



సాధారణంగా యుక్త వయస్సులో ఉన్నప్పుడు ఎలాంటి ఆహారం తీసుకున్నా సరే వయస్సు మీద పడుతున్న కొద్దీ కచ్చితంగా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే శరీరంపై తీవ్ర దుష్ప్రభావాలు ఉంటాయి. అనేక వ్యాధులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. చిన్నతనంలో సహజంగానే చాలా మంది చిరుతిళ్లను ఎక్కువగా తింటారు. కాస్త వయస్సు పెరిగిన తరువాత ఆ తిండి తగ్గుతుంది. కానీ వయస్సు మీద పడుతున్న తరువాత కూడి చిరు తిండిని తినడం శ్రేయస్కరం కాదు. ముఖ్యంగా 40 ఏళ్లకు పైబడిన వారు తమ ఆరోగ్యం విషయంలో అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. ప్రధానంగా తినే ఆహారం విషయంలో అసలు నిర్లక్ష్యం చేయకూడదు. ఆహారం పట్ల అశ్రద్ధ చేస్తే డయాబెటిస్, గుండె జబ్బులు, క్యాన్సర్, కీళ్ల నొప్పులు వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయి. కనుక 40 ఏళ్లకు పైబడిన తరువాత జంక్ ఫుడ్‌కు పూర్తిగా స్వస్తి చెప్పి ఆరోగ్యకరమైన ఆహారాలను తినాల్సి ఉంటుంది.

### టమాటాలు, చిలగడదుంపలు..

40 ఏళ్లకు పైబడిన వారు రోజూ తినాల్సిన ఆహారాల్లో టమాటాలు కూడా ఒకటి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది కెరోటినాయిడ్స్ జాబితాకు చెందుతుంది. దీని వల్లే టమాటాలు ఎరుపు రంగులో ఉంటాయి. టమాటాలను తినడం వల్ల క్యాన్సర్ వచ్చే ముప్పు గణనీయంగా తగ్గుతుంది. టమాటాలను రోజూ సూప్ లేదా జ్యూస్ రూపంలో తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. వయస్సు మీద పడుతున్న వారికి సహజంగానే కంటి చూపు మందగిస్తుంది. అలాగే బీపీ పెరుగుతుంది. ఈ సమస్యలు రాకుండా అడ్డుకోవాలంటే చిలగడదుంపలను తరచూ తినాలి. వీటిల్లో పొటాషియం, బీటా కెరోటిన్, ఫైటో కెమికల్స్ అధికంగా ఉంటాయి. ఇవి బీపీ పెరగకుండా చూస్తాయి. అలాగే కంటి చూపును మెరుగు పరుస్తాయి. కళ్లను రక్షిస్తాయి.

### కోడిగుడ్లు, పుట్ట గొడుగులు..

40 ఏళ్లకు పైబడిన వారు రోజూ ఒక కోడిగుడ్డును ఉడకబెట్టి తింటుంటే మేలు జరుగుతుంది. గుడ్డులోని పసుపు సొన తీసేసి కేవలం తెల్ల సొనను మాత్రమే తింటుండాలి. దీని వల్ల ప్రోటీన్లు అధికంగా లభిస్తాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. ఆరోగ్యంగా ఉండేలా చూస్తాయి. వీటి వల్ల ఉత్సాహంగా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. శరీర నిర్మాణానికి ప్రోటీన్లు దోహదం చేస్తాయి. ఎముకలకు బలాన్ని అందిస్తాయి. వీటి వల్ల కండరాల నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. 40 ఏళ్లకు పైబడిన వారు వారంలో రెండు సార్లు పుట్ట గొడుగులను తింటుంటే మేలు జరుగుతుంది. వీటి వల్ల క్యాల్షియం, విటమిన్ డి సమృద్ధిగా లభిస్తాయి. అలాగే మెదడు పనితీరు మెరుగు పడుతుంది. యాక్టివ్‌గా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మతిమరుపు తగ్గుతుంది.

### యాపిల్ పండ్లు, బాదంపప్పు..

40 ఏళ్లకు పైబడిన వారు రోజూ ఒక యాపిల్‌ను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల కొలెస్ట్రాల్, బీపీ నియంత్రణలో ఉంటాయి. గుండె పనితీరు మెరుగు పడుతుంది. గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ముఖ్యంగా హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. అలాగే జీర్ణ సంబంధిత సమస్యలు ఉండవు. అజీర్తి, గ్యాస్, మలబద్దకం వంటివి తగ్గుతాయి. యాపిల్ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయి. దీని వల్ల క్యాన్సర్లు రాకుండా చూసుకోవచ్చు. 40 ఏళ్లకు పైబడిన వారు నిత్యం గుప్పెడు బాదంపప్పును నీటిలో నానబెట్టి తింటుండాలి. దీని వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. డిప్రెషన్ నుంచి బయట పడవచ్చు. కీళ్ల నొప్పులు, వాపులు రాకుండా చూసుకోవచ్చు. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇలా 40 ఏళ్లకు పైబడిన స్త్రీలు, పురుషులు ఆయా ఆహారాలను రోజూ తింటుంటే వృద్ధాప్యంలో ఎలాంటి రోగాలు రాకుండా ఆరోగ్యంగా ఉండవచ్చు.

## కాలి మడమల నొప్పులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయా..? అయితే ఈ చిట్కాలను పాటించండి..!



శారీరక శ్రమ లేదా వ్యాయామం ఎక్కువ సమయం పాటు చేస్తే ఎవరికైనా సరే సహజంగానే ఒళ్లు నొప్పులు వస్తుంటాయి. అయితే కొందరికి వీటితోపాటు కాలి మడమలు కూడా నొప్పిగా ఉంటాయి. కాలి మడమల నొప్పి వచ్చేందుకు ఇంకా అనేక కారణాలు ఉంటాయి. ఎక్కువ సేపు నిలబడి ఉన్నా, హై హీల్స్ ధరించే మహిళల్లో, శరీరంలో క్యాల్షియం లోపించడం, వ్యాయామం అసలు చేయకపోవడం, పోషకాల లోపం వంటి కారణాల వల్ల కూడా కాలి మడమల నొప్పులు వస్తుంటాయి. అయితే ఇవి సాధారణంగా వాటంతట అవే తగ్గిపోతాయి. కానీ కొన్ని సందర్భాల్లో నొప్పి మరీ ఇబ్బందులకు గురి చేస్తుంది. ఒక పట్టాన తగ్గదు. అలాంటప్పుడు చాలా మంది పెయిన్ కిల్లర్స్ ఉపయోగిస్తారు. ఇవి ఆరోగ్యానికి ఏమాత్రం మంచివి కావు. కిడ్నీలపై భారం పడేలా చేస్తాయి. కనుక సహజసిద్ధమైన చిట్కాలను పాటించాల్సి ఉంటుంది. వీటి వల్ల కాలి మడమల నొప్పులతోపాటు ఒళ్లు నొప్పులను సైతం సులభంగా తగ్గించుకోవచ్చు.

### అల్లం నీళ్లు..

ఒక పాత్రలో తగినంత నీటిని తీసుకుని అందులో కొన్ని అల్లం ముక్కలను వేసి బాగా మరిగించాలి. అనంతరం ఆ మిశ్రమాన్ని వడకట్టి తాగాలి. దీని వల్ల మడమల నొప్పులు వెంటనే తగ్గుతాయి. ఆ నొప్పుల నుంచి తక్షణమే ఉపశమనం లభిస్తుంది. అల్లంలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు అన్ని రకాల నొప్పులను తగ్గేలా చేస్తాయి. ఈ మిశ్రమాన్ని రోజుకు 2 సార్లు ఒక కప్పు మోతాదులో తాగాల్సి ఉంటుంది. దీంతో ఎంతగానో ఫలితం ఉంటుంది. అలాగే ముఖాన్ని నీటితో శుభ్రం చేసుకుని బాగా నీటిని తాగాలి. తరువాత కాళ్లను 5 నిమిషాల పాటు వేడి నీటిలో ఉంచాలి. అనంతరం మరో 3 నిమిషాల పాటు చల్లని నీటిలో ఉంచాలి. ఇలా 3 సార్లు చేయాలి. దీంతో మడమల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ చిట్కా నొప్పులకు అద్భుతంగా పనిచేస్తుంది.

### లవంగం నూనె..

ఇక నొప్పులను తగ్గించడంలో లవంగ నూనె అద్భుతంగా పనిచేస్తుంది. మడమలపై లవంగనూనె బాగా మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల నొప్పుల నుంచి వెంటనే ఉపశమనం లభిస్తుంది. మనకు లవంగం నూనె మార్కెట్‌లో లభిస్తుంది. లేదా ఈ-కామర్స్ ప్లాట్ ఫామ్‌లపై కూడా దీన్ని కొనుగోలు చేయవచ్చు. అలాగే కాలి మడమలు, ఒళ్లు నొప్పులు ఉన్నవారు పలు ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల కూడా ఈ నొప్పులను తగ్గించుకోవచ్చు. అందుకు గాను ఆలుగడ్డలు,కీరదోస, ఉసిరికాయలు, టమాటా, పచ్చి బొప్పాయి, క్యాబేజీ, కాలిఫ్లవర్ వంటి ఆహారాలు మేలు చేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల నొప్పులను తగ్గించుకోవచ్చు. ఈ ఆహారాల్లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు నొప్పులను తగ్గిస్తాయి.

### ఆవ గింజల పొడి..

కాలి మడమల నొప్పులు తగ్గాలంటే ఆవ గింజలు కూడా బాగానే పనిచేస్తాయి. కొన్ని ఆవ గింజలను తీసుకుని మెత్తని పొడిలా మార్చాలి. అనంతరం ఒక బకెట్‌లో వేడి నీటిని తీసుకుని అందులో ముందుగా సిద్ధం చేసిన ఆవ గింజల పొడి వేసి బాగా కలపాలి. అనంతరం ఆ బకెట్‌లో కాళ్లను ఉంచాలి. కాళ్ల మడమలు బాగా మునిగేలా కాళ్లను బకెట్ లో పెట్టాలి. ఇలా 15 నిమిషాల పాటు ఉంచాలి. ఇలా చేస్తున్నా కూడా కాలి మడమల నొప్పులను తగ్గించుకోవచ్చు. అలాగే ఆవ గింజల పొడికి బదులుగా రాక్ సాల్ట్ ను కూడా ఉపయోగించవచ్చు. అర బకెట్ వేడి నీటిలో రాక్ సాల్ట్ వేసి కలిపి అనంతరం ఆ నీటిలో కాళ్లను ఉంచాలి. 15 నిమిషాల పాటు కాళ్లను ఉంచి తీసేయాలి. దీని వల్ల కూడా నొప్పులు తగ్గిపోతాయి. అలాగే రాత్రి పూట ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలలో కొద్దిగా పసుపు, తేనె కలిపి తాగుతున్నా కూడా ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. పసుపులో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు అన్ని రకాల నొప్పులను తగ్గించడంలో సహాయం చేస్తాయి. ఇలా ఈ చిట్కాలను పాటిస్తుంటే కాలి మడమల నొప్పులను సమర్థవంతంగా తగ్గించుకోవచ్చు.

## చర్మ సమస్యలు పోవాలంటే...




వర్షాకాలంలో సహజంగానే అనారోగ్య సమస్యలు ఎక్కువ. వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు, సీజనల్ వ్యాధులు చుట్టుముడుతుంటాయి. మరోవైపు చర్మ సంబంధిత సమస్యలు కూడా ఎక్కువగా ఉంటాయి. వర్షపు నీరు, ఉక్కపోత, చెమట కారణంగా చర్మంపై దద్దుర్లు, దురద ప్రధానంగా కన్పిస్తుంటుంది. అయితే కొన్ని వంటింటి చిట్కాలతో సులభంగానే ఈ సమస్యల్నించి గట్టెక్కవచ్చంటున్నారు చర్మ వైద్య నిపుణులు. స్నానానికి ముందు ఒక స్పూన్ బేకింగ్ సోడాలో నిమ్మరసం పిండుకుని మిశ్రమంగా తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని స్నానానికి ముందు మొత్తం శరీరానికి మర్దనా చేసి 15-20 నిమిషాలుంచాలి. ఆ తరువాత స్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల దురద సమస్యల నుంచి విముక్తి పొందవచ్చు. ఒక గిన్నెలో వేడి నీళ్లు తీసుకొని అందులో వేపాకులు వేయాలి. ఆ నీళ్లను స్నానం చేసే నీళ్లల్లో కలుపుకుని స్నానం చేయాలి. ఇలా వారానికి 3 సార్లు చేస్తే దురద సమస్యల్నించి గట్టెక్కవచ్చు. చర్మ సంబంధిత సమస్యల్ని దూరం చేసేందుకు కొబ్బరి నూనె అద్భుతమైన ఔషధంగా చెప్పవచ్చు. సీజన్‌తో సంబంధం లేకుండా ఎప్పుడైనా స్నానానికి ముందు కొబ్బరినూనెను శరీరానికి మర్దన చేసుకుంటే చర్మానికి పోషక గుణాలు అందించడమే కాకుండా ఇన్‌ఫెక్షన్ నుంచి దూరం చేస్తుంది.

## రాత్రి పూట నిద్రించడానికి ముందు బాదంపప్పును తిని పాలను తాగండి.. ఎన్నో లాభాలు ఉంటాయి..!



ఆరోగ్యకరమైన పోషకాహారాల్లో బాదంపప్పులు ఎల్లప్పుడూ ముందుంటాయి. ఆరోగ్యకరమైన ఆహారాలు అనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చే పేర్లలో బాదంపప్పు కూడా ఒకటి. బాదంపప్పు అనేక పోషకాలను కలిగి ఉంటుంది. ఈ పప్పును రోజూ తింటుంటే అనేక లాభాలను అందిస్తుంది. ఈ క్రమంలోనే బాదంపప్పును రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని పోషకాహార నిపుణులు, వైద్యులు కూడా సూచిస్తుంటారు. అయితే బాదంపప్పును రాత్రి పూట నిద్రకు ముందు తింటే ఎంతగానో మేలు జరుగుతుంది. ముఖ్యంగా 7 లేదా 8 బాదంపప్పులు రాత్రి పూట నిద్రకు ముందు తినాలి. అనంతరం ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలను తాగాలి. ఇలా రోజూ చేస్తుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

### మానసిక ఆరోగ్యానికి..

రోజూ రాత్రి పూట బాదంపప్పును తిని పాలను తాగడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. డిప్రెషన్ నుంచి బయట పడవచ్చు. నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్ర లేవిం తగ్గుతుంది. మానసిక ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయి. బాదంపప్పులో మెగ్నిషియం అధికంగా ఉంటుంది. ఇది కండరాలను ప్రశాంతంగా మారుస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు బాదంపప్పు తిని పాలను తాగడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. ఆ సమస్య నుంచి సులభంగా బయట పడవచ్చు. దీని వల్ల నిద్రకు ఎలాంటి ఆటంకం ఏర్పడకుండా ఉంటుంది.

### ఎముకల దృఢత్వానికి..

బాదంపప్పులను తిని పాలను తాగితే శరీరంలో మెలటోనిన్ శాతం పెరుగుతుంది. దీని వల్ల నిద్ర చక్కగా పడుతుంది. రాత్రి పూట ఈ ఆహారాలను తీసుకుంటే మరుసటి రోజు ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి. ఈ రెండింటిలోనూ క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుంది. కనుక ఈ రెండింటినీ రోజూ తీసుకుంటే ఎముకలు, దంతాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. విరిగిన ఎముకలు త్వరగా అతుక్కుంటాయి. ఎముకలు నిర్మాణమవుతాయి. దంతాల నొప్పి తగ్గిపోతుంది. ఈ రెండింటి మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల విటమిన్ ఇ అధికంగా లభిస్తుంది. ఇది మెదడును ఆరోగ్యంగా ఉంచుతుంది. యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తుంది. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. దీని వల్ల మెదడు కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది.

### గుండె ఆరోగ్యానికి..

ఈ రెండింటి మిశ్రమాన్ని తీసుకుంటే మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. వీటి వల్ల శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ మిశ్రమాన్ని తీసుకుంటే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు లభించి షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. దీని వల్ల డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. అయితే రాత్రి పూట నిద్రించడానికి కనీసం 30 నిమిషాల ముందు బాదంపప్పును తిని అనంతరం పాలను తాగాల్సి ఉంటుంది. పాలు అంటే అలర్జీ ఉన్నవారు సోయా పాలను తాగవచ్చు. గేద పాల కన్నా ఆవు పాలను ఇలా తాగుతుంటే ఇంకా ఎంతగానో మేలు జరుగుతుంది. ఇలా బాదంపప్పు, పాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## ఈ మసాలా దినుసులను తరచూ తీసుకోండి.. మీ శరీర రోగ నిరోధక శక్తి ఎప్పటికీ తగ్గదు..!

సీజన్లు మారినప్పుడు లేదా వాతావరణం చల్లగా ఉన్నప్పుడు చాలా మందికి దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ వంటి సమస్యలు వస్తుంటాయి. గొంతు, ఊపిరితిత్తులు, శ్వాస నాళాల్లో కఫం చేరుతుంది. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. అయితే రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉన్నవారికి ఈ సమస్యల తీవ్రత తక్కువగానే ఉంటుంది కానీ రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటే మాత్రం ఈ సమస్యలు మరింత ఇబ్బందులకు గురి చేస్తాయి. అలాగే ఫ్లూ, ఆస్తమా, బ్రాంకైటిస్, జ్వరం వంటి సమస్యలు కూడా వస్తాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తరచూ అనారోగ్యాల బారిన పడుతుంటారు. ఒక పట్టాన తగ్గవు. కానీ మన ఇంట్లో ఉండే పలు మసాలా దినుసులను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే రోగ నిరోధక శక్తిని ఎల్లప్పుడూ ఎక్కువగా ఉండేలా చేసుకోవచ్చు. దీంతో అనేక రోగాలు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

### ఇంగువ, పసుపు..

మన వంట ఇంటి పదార్థాల్లో ఇంగువ కూడా ఒకటి. దీన్ని కొందరు తరచూ వంటల్లో వేస్తుంటారు. ఇది అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. ఇంగువలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ బయోటిక్, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. రోజూ వంటల్లో ఇంగువను వేసి వాడితే ఎంతో ఉపయోగం ఉంటుంది. ఇమ్యూనిటీ పవర్ ఎల్లవేళలా ఎక్కువగా ఉంటుంది. రోగాలు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే పసుపును కూడా మనం రోజూ వంటల్లో వేస్తుంటాం. ఇది కూడా రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. రోజూ రాత్రి పూట పాలలో పసుపు కలిపి తాగాలి. లేదా పసుపును గోరు వెచ్చని నీటిలో కలిపి కూడా తాగవచ్చు. పసుపు వల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు రాకుండా అడ్డుకోవచ్చు.

### మిరియాలు, లవంగాలు..

మన శరీర రోగ నిరోధక శక్తిని పెంచడంలో మిరియాలు కూడా అద్భుతంగా పనిచేస్తాయి. వీటిల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ ఆక్సిడెంట్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఇవి వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను నయం చేస్తాయి. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. రోజూ రాత్రి గోరు వెచ్చని పాలలో మిరియాల పొడి కలిపి తాగుతుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే వంట ఇంటి మసాలా దినుసుల్లో ఒకటైన లవంగాలు కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. వ్యాధుల నుంచి రక్షిస్తాయి. రోజూ రాత్రి పూట ఒకటి లేదా రెండు లవంగాలను తిని గోరు వెచ్చని పాలు లేదా నీళ్లను తాగుతుంటే ఉపయోగం ఉంటుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

### మెంతులు..

మెంతులను కూడా మనం తరచూ వంటల్లో ఉపయోగిస్తాం. ఇవి కొలెస్ట్రాల్, షుగర్ లెవల్స్‌ను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. అలాగే వీటిని తినడం వల్ల రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. జీర్ణ సమస్యలు తగ్గుతాయి. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. రోజూ రాత్రి పూట మెంతులను నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయాన్నే పరగడుపునే వాటిని తినాలి. ఇలా చేస్తుంటే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మెంతులను నేరుగా తినలేకపోతే మెంతుల పొడిని మజ్జిగలో లేదా గోరు వెచ్చని నీటిలో కలిపి తాగవచ్చు. ఇలా చేస్తున్నా కూడా ఉపయోగం ఉంటుంది.

### దాల్చిన చెక్క..

ఇక వంట ఇంటి మసాలా దినుసుల్లో ఒకటైన దాల్చిన చెక్క కూడా మనకు మేలు చేస్తుంది. ఇందులో మాంగనీస్, క్యాల్షియం, ఫైబర్, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఇందులో యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. కనుక దీన్ని రోజూ తీసుకుంటే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది. దాల్చిన చెక్క పొడిని మీరు తినే ఆహారాలపై చల్లి తీసుకోవచ్చు. లేదా గోరు వెచ్చని పాలు, నీటిలో కలిపి కూడా తాగవచ్చు. దీంతో ఎంతగానో ఉపయోగం ఉంటుంది. ఇలా ఆయా మసాలా దినుసులు, వంట ఇంటి పదార్థాలు మన రోగ నిరోధక శక్తిని పెంచడంలో ఎంతగానో సహాయం చేస్తాయి. కనుక వీటిని తరచూ తీసుకోవాలి.



## ఆర్మీ జవాన్ కిషన్ మృతి పట్ల వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



తాడేపల్లి: ఆర్మీ జవాన్ కిషన్ మృతి పట్ల వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ??రాంతి వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన హవల్దార్ కువ్వరపు కిషన్ మృతి తీవ్ర దిగ్గ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. భారత్–చైనా సరిహద్దులో విధులు నిర్వహిస్తూ ఆయన ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమంటూ ట్వీట్ చేశారు. “దేశం కోసం ఆయన చేసిన సేవలకు సెల్యూట్ చేస్తున్నాను. హవల్దార్ కిషన్ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. ఈ తీవ్ర దుఃఖ సమయంలో ఆయన కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను” అని వైఎస్ జగన్ అన్నారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన లంకపల్లి రైతులు



తాడేపల్లి : కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం, పమిడిముక్కల మండలం లంకపల్లి గ్రామానికి చెందిన రైతులు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తమ గ్రామ పరిధిలోని సుమారు 600 ఎకరాల లంక భూములకు సంబంధించి తీవ్ర అవకతవకలు చోటు చేసుకున్నాయని వైఎస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు రైతులు. 1952 నుంచి ఆ భూములను సాగు చేసుకుంటున్న రైతులమైన తమను పక్కనపెట్టి, స్థానిక టీడీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై టీడీపీ నాయకులు, వారి బినామీల పేర్లతో అనధికారికంగా పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ హక్కులను కాదని, రాజకీయ ప్రాబల్యంతో భూములను ఇతరుల పేర్లకు మార్చి వారి పేరుతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేశారని వైఎస్ జగన్‌కు ఫిర్యాదు చేశారు సదురు రైతులు. లంక భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తమకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ అండగా నిలవాలని వైఎస్ జగన్‌ను కోరారు రైతులు. రైతుల సమస్యలను, వారి ఆవేదనను విన్న వైఎస్ జగన్.. వారికి అవసరమైన న్యాయం సహాయం పార్టీ తరఫున అందిస్తామని భరోసా ఇచ్చారు. బాధిత రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## రిబ్బన్ కటింగ్ సీఎంగా రేవంత్ రెడ్డి : పాడి కౌశిక్ రెడ్డి



హైదరాబాద్ : అభివృద్ధి ఎలా చేయాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను చూసి సీఎం రేవంత్ రెడ్డి నేర్చుకోవాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హితవు పలికారు. ఇవాళ తెలంగాణ అసెంబ్లీలో ఎథిక్స్ కమిటీ సమావేశం కొనసాగుతోంది. సభలో పాడి కౌశిక్ రెడ్డి వ్యవహారశైలిపై ఈ కమిటీ విచారణ జరుపుతోంది. దీనికి సంబంధించి ఆయన కోరిన గడువు, వీడియో ఫుటేజీల అంశాలపై సమావేశంలో చర్చ జరుగుతోంది. ఎథిక్స్ కమిటీ విచారణకు హాజరయ్యే క్రమంలో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానన్న రేవంత్ రెడ్డి.. ఇప్పుడు కేసీఆర్ కట్టిన కలెక్టర్ కార్యాలయాలను ప్రారంభిస్తున్నారు. కేసీఆర్ ఆనవాళ్లను ఎవరూ చెరపలేరు. కేసీఆర్ కట్టిన బిల్డింగ్‌ల ముందు ‘కాంగ్రెస్ తల్లి’ విగ్రహాన్ని పెట్టి రిబ్బన్ కట్ చేస్తున్నారు. మేం అధికారంలోకి వచ్చాక ఆ కాంగ్రెస్ తల్లిని గాంధీభవన్‌కు పార్శిల్ చేస్తాం. సీఎం రేవంత్ రెడ్డి కేవలం రిబ్బన్ కటింగ్ సీఎంగానే మిగిలిపోతారు. కరీంనగర్‌లో రూపాయి ఖర్చు పెట్టకుండా రేవంత్ రెడ్డి ఓపెనింగ్‌లు చేస్తున్నారు. సిరిసిల్ల నుంచి జనం రాకపోతే, పక్క జిల్లాల నుంచి కాంగ్రెస్ సభకు జనాలను తరలిస్తున్నారు. సిరిసిల్లలో కేటీఆర్ చేసిన అభివృద్ధిలో కనీసం సగమైనా కొడంగల్‌లో రేవంత్ రెడ్డి చేసి చూపించాలి. కేటీఆర్ చేసిన అభివృద్ధిని చూసైనా సీఎం నేర్చుకోవాలి. 2009 నుంచి కేటీఆర్‌కు ఓటమి తెలియదు.. కేటీఆర్‌కు రేవంత్ రెడ్డి అసలు పోటీ కానేకాదు. కరీంనగర్ జిల్లా రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా. నా హుజురాబాద్ నియోజకవర్గ దళితులకు రెండో విడత రైతు బంధు అందించాలి. అలాగే నా నియోజకవర్గ అభివృద్ధికి వెయ్యి కోట్లు ప్రకటించాలని సీఎంను కోరుతున్నా’ అని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు.

## నమో భారత్ రైళ్లలో ట్రిప్ పాస్




న్యూఢిల్లీ: నమోభారత్ రైళ్లలో ప్రయాణం ఇప్పుడు మరింత సౌకర్యవంతంగా మారింది. రోజువారీ ప్రయాణికుల కోసం నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రారీన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎన్‌సీఆర్‌టీసీ) కొత్త ట్రిప్ పాస్ సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. నిత్యం ఒకే రెండు స్టేషన్ల మధ్య ప్రయాణించే ప్రయాణికులు, పదేపదే టిక్కెట్లు కొనడం, నేషనల్ కామన్ మొబిలిటీ (ఎన్‌సీఎంసీ) కార్డులను రీచార్జ్ చేసుకోవాల్సిన అవసరం లేకుండా ఒకేసారి గరిష్టంగా 40 ట్రిప్పులను కొనుగోలు చేసే అవకాశం కల్పించింది. ప్రయాణికులు తమకు అవసరమైన 15 లేదా 20 లేదా 40 ట్రిప్‌లకు పాస్‌ను ముందుగానే కొనుగోలు చేయొచ్చు. అదే రెండు స్టేషన్ల మధ్య ప్రయాణించిన తర్వాత ఆ ట్రిప్‌కు సంబంధించిన చార్జీ మాత్రమే ఆ మొబిలిటీ కార్డ్ నుంచి ఎన్‌సీఆర్‌టీసీ తీసుకుంటుంది. ఈ సౌకర్యం స్టాండర్డ్, ప్రీమియం కోచ్‌లు రెండింటికీ అందుబాటులో ఉంది. ఒక ట్రిప్ పాస్ 15 రోజుల్లో, 10 ట్రిప్పుల పాస్‌లు 30 రోజుల్లో, 15, 20 ట్రిప్పుల పాస్‌లు 60 రోజుల్లో పయోగించుకోవాల్సి ఉంటుంది. 40 ట్రిప్పుల పాస్ అయితే మూడు నెలలపాటు చెల్లుబాటు అవుతుంది. ట్రిప్ పాస్ ఎంచుకున్న నిర్దిష్ట స్టేషన్ల మధ్య మాత్రమే చెల్లుబాటు అవుతుంది. రోజువారీ ప్రయాణాలు కొనసాగించే వారికి ఈ సౌకర్యం ప్రయోజనం చేకూరుస్తుందని కార్పొరేషన్ తెలిపింది.

# అలసత్వంపై ‘సుప్రీం’ కొరడా



నలుగురు గుమిగూడి నిరసనకు దిగితే అతిగా స్పందించటం అలవాటైన ఢిల్లీ పోలీసులకు ఇటీవల అక్కడ వరసగా చోటుచేసుకున్న లైంగిక నేరాల గురించి పట్టింపు లేనట్టు కనబడుతోంది. మొన్న ఆగస్టులో గ్రేటర్ నోయిడా నుంచి కశ్మీరీ గేటువరకూ 47 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన బస్సులో ఒక మైనర్ బాలికపై దుండగులు అత్యాచారానికి ఒడిగట్టారు. వారంరోజుల క్రితం ఆగ్నేయ ఢిల్లీలోని ఆస్తా కుంజ్ పార్క్ దగ్గర మరో మైనర్ బాలికపై ముగ్గురు లైంగిక నేరానికి పాల్పడి హత్యచేశారు. దానికి సమీపంలోని లేడీ శ్రీరాం కాలేజీ విద్యార్థినులైతే తమకు లైంగిక వేధింపులు నిత్యకృత్యమయ్యాయనీ, ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండటం లేదనీ చెబుతున్నారు. ఢిల్లీ--ఎన్‌సీఆర్ పరిధిలో ఈనెల మొదటివారం మొదలుకొని ఇప్పటివరకూ డజను వరకూ లైంగిక నేరాలు వెలుగులోకొచ్చాయని మీడియా కథనాలు చెబుతున్నాయి. అందుకే సోమవారం సర్వోన్నత న్యాయస్థానం పోలీసులపైనా, అధికార యంత్రాంగంపైనా ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇవన్నీ 2012 నాటి నిర్భయ ఉదంతాన్ని గుర్తుకు తెస్తున్నాయని వ్యాఖ్యానించించటంతోపాటు శాంతిభద్రతల్ని మెరుగుపరచడానికి నాలుగు సూచనలు చేసింది. వీటిని వచ్చేనెల 5 లోగా అమల్లోకి తీసుకురావాలని ఆదేశించింది. డీఎస్‌పీ ర్యాంకుకు తక్కువకాని అధికారులతో జిల్లాలవారీగా ఎక్కడెక్కడ ప్రమాదకర ప్రాంతాలున్నాయో గుర్తించాలన్నది అందులో మొదటి సూచన. అక్కడి పార్కులు, విద్యాసంస్థలు, శివారు ప్రాంతాలు వగైరాలను ఇందుకోసం కూలంకషంగా పరిశీలించాలని తెలిపింది. అలాగే ఇలాంటి ప్రాంతాల్లో రోజంతా గస్తీ ఉండేలా చూడాలని కోరింది. నిఘా కెమెరాల పనితీరు ఎలావుందో తరచు తనిఖీలుచేసి, అవసరమైన మరమ్మత్తులు చేయించాలని, చీకటి ప్రాంతాలు ఎక్కడా ఉండటానికి వీల్లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. వాహనాల కిటికీలకు నల్లటి తెరలు, ఫిల్ములు లేకుండా చూడాలని ఆదేశించింది. నిజానికి వీటిల్లో కొన్ని నిర్భయ ఉదంతం తర్వాత ఏర్పాటైన జస్టిస్ జేఎస్ వర్మ కమిషన్ సిఫార్సుల్లో కూడా ఉన్నాయి. 2012లో నిర్భయ ఉదంతం తర్వాత దేశ వ్యాప్తంగా పెల్లుబికిన నిరసనలతో యూపీఏ ఆధ్వర్యంలోని కేంద్రం వెంటనే స్పందించి ఈ కమిషన్ ఏర్పాటుచేసింది. అది నివేదిక ఇవ్వడానికిముందే ఉరిశిక్షతోసహా కఠిన శిక్షలకు ఆస్కారం కల్పించే నిర్భయ ఆర్డినెన్స్ కూడా తెచ్చింది. అప్పట్లోనే ఆ ఆర్డినెన్స్ పైనా, దాని స్థానంలో వచ్చిన చట్టంపైనా మానవహక్కుల సంఘాలు, మహిళా సంఘాలూ పెదవి విరిచాయి. కేవలం కఠిన శిక్షలు నిర్దేశించినంత మాత్రాన నేరాలు ఆగబోవనీ, వెంటవెంటనే స్పందించే యంత్రాంగం, పకడ్బందీ దర్యాప్తు, న్యాయ స్థానాల్లో వేగంగా విచారణ, శిక్షలు ఉంటేనే నేరం చేయాలంటే భయపడే పరిస్థితులుంటాయనీ ఆ సంఘాలు తెలిపాయి. ఇటీవల ఐపీసీ బదులుగా తీసుకొచ్చిన భారతీయ న్యాయసంహితలో అత్యాచార నేరానికి విధించే శిక్షను ఏడేళ్లనుంచి పదేళ్లకు పెంచారు కూడా. దాదాపు పదిహేనేళ్లు గడిచాక చూస్తే పరిస్థితి మొదటికొచ్చింది. కళాశాల విద్యార్థినులు ఫిర్యాదులు చేస్తున్నా పోలీసులకు తీరిక లేకపోయింది. కనీసం ఆ ప్రాంతంలో గస్తీ పెంచాలన్న ఆలోచన కూడా రాలేదు. దాని పర్యవసానంగానే బాలిక బలైపోయింది. మహిళలపై సమాజంలో శతాబ్దాలుగా పేరుకుపోయిన భావనలు, జెండర్ వివక్ష, బాధ్యతాయుత స్థానాల్లో ఉండేవారి వ్యవహారశైలి, ప్రభుత్వాల అలసత్వమూ ఇలాంటి నేరాలను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నాయని జస్టిస్ జేఎస్ వర్మ కమిషన్ చేసిన వ్యాఖ్య గమనించదగ్గది. ఉదంతం జరిగినప్పుడల్లా బాధితుల్నే తప్పుబట్టే సంస్కృతి దేశంలో ఇంకా పోలేదు. వాస్తవానికి నిర్భయ ఉదంతం తర్వాత వెనువెంటనే చర్యలుంటాయన్న భరోసాతో ఫిర్యాదులు చేసేవారి సంఖ్య పెరిగింది. కానీ ఎప్పట్లానే అలసత్వమూ, ఫిర్యాదు ఇచ్చినవారినే తప్పుబట్టే ధోరణి గమనించాక చాలామంది వెనక్కి తగ్గటం మొదలైంది. అసలు నమోదైన కేసుల దర్యాప్తులో పోలీసులు నిరాసక్తత సమస్యను మరింత పెంచుతోంది. నిరుడు వెలువడిన గణాంకాల ప్రకారంఢిల్లీ పరిధిలో రోజుకు అయిదు అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. పరిస్థితి మరింత జటిలం కాకముందే పోలీసులు మేల్కొనాలి. సుప్రీంకోర్టుసూచనలనుతక్షణమే అమల్లోకి తీసుకురావాలి.

# కాక్‌పిట్‌లో పైలట్ల కొట్లాట.. గాల్లో హైజాక్ కలకలం!




దుబాయ్:పశ్చిమాసియాలో మరోసారి తీవ్ర కలకలం రేపిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. యూఏఈలోని దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ‘ఫ్లైదుబాయ్’ విమానంలో పైలట్ల మధ్య తలెత్తిన వివాదం పెను సంచలనానికి దారితీసింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ విమానం అత్యవసర సంకేతాలను జారీ చేయడంతో ఏవియేషన్ వర్గాల్లో భయాందోళనలు వ్యక్తమయ్యాయి. ఫ్లైట్ ట్రాకింగ్ డేటా,ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ నివేదిక ప్రకారం.. విమానం గాల్లో ఉండగానే మొదట అంతర్జాతీయ అత్యవసర సంకేతాన్ని జారీ చేసింది. అయితే ఆ వెంటనే ఆ కోడ్ కాస్తా విమానం హైజాక్‌కు గురైనట్లు తెలిపే ప్రమాదకరమైన ‘హైజాక్ కోడ్’కి మారింది. ఈ అత్యవసర సంకేతం వెలువడే కేవలం రెండు నిమిషాల ముందే, విమానం అకస్మాత్తుగా సుమారు 17,400 అడుగుల మేర కిందకి దిగడం గగనతలంలో తీవ్ర ఉత్కంఠకు గురిచేసింది.

### రంగంలోకి ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు

విమానం నుంచి ‘7500’ స్క్వాక్ కోడ్ ప్రసారం కావడంతో ఇజ్రాయెల్ రక్షణ శాఖ ఒక్కసారిగా అప్రమత్తమైంది. వెంటనే ఇజ్రాయెల్ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఆ వాణిజ్య విమానం వైపు దూసుకెళ్లాయి. ఫ్లైట్‌రాడార్24 ఫుటేజ్ ప్రకారం.. టెల్ అవీవ్‌కు వెళ్లాల్సిన ఆ విమానం, జోర్డాన్ గగనతలంలోకి దూసుకెళ్లి, ఆపై ఇజ్రాయెల్ వైపు వెళ్లకుండా తిరిగి సౌదీ అరేబియా గగనతలంలోకి మళ్లింది. చివరికి సౌదీలోని పౌర, సైనిక స్థావరమైన తబూక్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఈ పరిణామాల మధ్య ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం అత్యవసరంగా స్పందించి పరిస్థితి అదుపులో ఉందని స్పష్టం చేసింది.

### అసలు కారణం పైలట్ల మధ్య గొడవే

భద్రతా అధికారులను ఉటంకిస్తూ వచ్చిన నివేదికల ప్రకారం.. టెర్రర్ అటాక్ అనుకున్న ఈ ఘటనకు అసలు కారణం ఉగ్రవాదం కాదని తేలింది. విమానంలోని ఇద్దరు పైలట్లు (పైలట్, కో-పైలట్) మధ్య కాక్‌పిట్‌లో తలెత్తిన వ్యక్తిగత ఘర్షణే అసలు కారణమని అధికారులు ధృవీకరించారు. అయితే, ఈ ఘటనకు సంబంధించి ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విమానాన్ని నడిపిన కెప్టెన్ రష్యా దేశస్థుడు కాగా, కో-పైలట్ ఉక్రెయిన్ దేశస్థుడని.. వారిద్దరి మధ్య ఉన్న దేశాల ఉద్రిక్తతల ప్రభావమో లేదా వ్యక్తిగత విభేదాల కారణంగానో ఈ గొడవ జరిగిందని కొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థలు (ఛానెల్ 12 వంటివి) నివేదించాయి. ఈ భౌతిక దాడి కారణంగా ఇద్దరు పైలట్లు గాయపడి ఆసుపత్రిలో చేరినట్లు తబూక్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న సంస్థ అధికారికంగా వెల్లడించింది.

### ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు

ఎన్నికలకు ముందు శత్రు దేశాల నుంచి దాడులు జరగవచ్చనే హెచ్చరికల నేపథ్యంలో, ఈ విమాన ఘటన కొద్దిసేపు తీవ్ర అలజడి సృష్టించింది. విమానంలో ఉన్న ప్రయాణికులు, సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పైలట్ల వ్యక్తిగత గొడవ కారణంగా ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చినప్పటికీ.. చివరికి అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# అమెరికాలో మధ్యంతర ఎన్నికలు.. ట్రంప్‌పై ఇరాన్ పిడుగు!




టెహ్రాన్: అంతర్జాతీయ రాజకీయాల్లో ఊహించని సరికొత్త డ్రామా తెరపైకి వచ్చింది. అమెరికాలో మధ్యంతర (మిడ్‌టర్మ్) ఎన్నికల వేళ అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇరాన్ గట్టిగానే షాకిచ్చింది. ట్రంప్ పాలనా విధానాలను, ఆయన తీసుకుంటున్న అడ్డగోలు నిర్ణయాలను నేరుగా వ్యతిరేకించాలంటూ ఇరాన్‌కు చెందిన అత్యంత శక్తివంతమైన సైనిక దళం ‘ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్’ అమెరికన్ ఓటర్లకు ఒక బహిరంగ లేఖను సంధించింది. సరిగ్గా ఎన్నికలకు ఐదు వారాల ముందు విడుదలైన ఈ 25 పేజీల సంచలన లేఖ ఇప్పుడు అమెరికా రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది! ట్రంప్ రాజకీయ భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తూ ఇరాన్ వేసిన ఈ మాస్టర్ ప్లాన్ అగ్రరాజ్యంలో పెద్ద మంటలే రేపుతోంది. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దళాలు ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించి ఏడు నెలలు గడిచిన తరుణంలో ఈ లేఖ వెలువడడం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా పౌరులకు, అక్కడి స్వార్థపూరిత రాజకీయ నాయకత్వానికి మధ్య చాలా తేడా ఉందని ఐఆర్‌జీసీ ఈ లేఖలో ఎత్తిచూపింది. ఇరాన్ సామాన్య ప్రజలు, అమెరికన్ పౌరులు ఇద్దరూ కూడా ఖరీదైన యుద్ధాలను ప్రోత్సహించే లీడర్ల బాధితులేనని వాదించింది. ఇజ్రాయెల్‌కు ట్రంప్ ఇస్తున్న గుడ్డి మద్దతును నిలిపివేయాలని, విదేశీ సైనిక జోక్యాలను తక్షణమే వ్యతిరేకించాలని అమెరికన్లను ఈ లేఖ కోరింది.

### వాషింగ్టన్ తన ఓటమిని అంగీకరించాలి

టెహ్రాన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి జనరల్ హోస్సేన్ మొహెబ్బీ ఈ లేఖపై నిప్పులు చెరిగారు. ప్రస్తుత సంఘర్షణకు తెరపడాలంటే వాషింగ్టన్ తన ఓటమిని అంగీకరించి, సైనిక బలగాలను వెనక్కి తీసుకోవడమే ఏకైక మార్గమని తేల్చిచెప్పారు. అమెరికాలో ప్రస్తుతం రాజకీయ వ్యవస్థ అత్యంత బలహీనంగా ఉన్న తరుణాన్ని దృష్టిలో పెట్టుకునే ఈ లేఖను విడుదల చేశామని ఆయన కుండ బద్దలు కొట్టారు. అణు ఆయుధాల ముసుగులో ట్రంప్ చేస్తున్న డ్రామాలన్నీ ప్రపంచాన్ని మోసం చేయడానికేనని, తమ యురేనియం శుద్ధి కేవలం శాంతియుత ప్రయోజనాల కోసమేనని స్పష్టం చేశారు.

### ‘డెత్ టు అమెరికా’ అసలు అర్థం అదే!

ఇరాన్ రాజకీయ వ్యవస్థలో తరచూ వినిపించే వివాదాస్పద నినాదం ‘డెత్ టు అమెరికా’పై కూడా ఈ లేఖలో క్లారిటీ ఇచ్చారు. ఈ నినాదం అమెరికన్ ప్రజలను ఉద్దేశించి కాదని, వైట్‌హౌస్‌ను కేంద్రంగా చేసుకుని పాలిస్తున్న ‘దయ్యం లాంటి పాలక వర్గాన్ని’ అంతం చేయాలని కోరుతూ చేసే ప్రార్థన మాత్రమేనని వివరించారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ వేలాది వైమానిక దాడులు చేసినప్పటికీ, తమ మౌలిక సదుపాయాలను దెబ్బతీశారే తప్ప తాము నిర్దేశించుకున్న ఏ ఒక్క లక్ష్యాన్నీ సాధించలేకపోయాయని, చివరికి అమెరికా సైనిక ఆస్తులకే భారీ నష్టం వాటిల్లిందని ఐఆర్‌జీసీ ఘాటుగా హెచ్చరించింది.

### ఎన్నికల గండం నుంచి గట్టెక్కేందుకు ట్రంప్ తంటాలు..

ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న ఈ మధ్యంతర ఎన్నికలు కేవలం కాంగ్రెస్ స్థానాల కోసమే అయినప్పటికీ, ఇవి పూర్తిగా ట్రంప్ పాలనా తీరుపై ప్రజాభిప్రాయాన్ని తెలిపే రెఫరెండ్‌లా మారాయి. ద్రవ్యోల్బణం,పెరుగుతున్న జీవన వ్యయం వల్ల రిపబ్లికన్ పార్టీకి, ట్రంప్ విధానాలకు వ్యతిరేకత తీవ్రస్థాయిలో పెరుగుతోంది. ఈ ఎన్నికల ఉచ్చు నుంచి బయటపడేందుకు ట్రంప్ తంటాలు పడుతూ.. అమెరికన్ ఓటర్లకు ఏకంగా ఐదు వేల డాలర్లు ఇస్తానంటూ వరాల జల్లు కురిపిస్తున్నారు. వియత్నాం యుద్ధ కాలంలో అమెరికన్ సైనికులను తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టడానికి ప్రసారాలను ఉపయోగించిన ‘హనోయ్ హన్నా’తరహా వ్యూహాన్నే ఇప్పుడు ఇరాన్ అచ్చం దింపిందని రాజకీయ విశ్లేషకులు మండిపడుతున్నారు. వాషింగ్టన్ పెద్దలను లైట్ తీసుకుని, నేరుగా అమెరికన్ ఓటర్లతోనే ఇరాన్ చక్రం తిప్పుతుండటంతో ట్రంప్‌నకు నిద్రపట్టడం లేదు. మరోవైపు ఇరాన్ కరెన్సీ ‘రియల్’ విలువ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా పడిపోయి, ఒక అమెరికన్ డాలర్‌కు ఏకంగా 25 లక్షల రియల్స్‌కు చేరినప్పటికీ... ఇరాన్ మాత్రం తగ్గేదేలే అన్నట్టు ట్రంప్‌ను వేదికపైనే కార్నర్ చేస్తుండటం ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది!

శివసూర్య
RNI APTEL : 2023/88704

సినిమా న్యూస్

గురువారం - 01 - అక్టోబర్ - 2026

# అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుంది మరి!



'మిరాయ్'తో మెప్పించిన రితికా

బలమైన కథ కోసమే తీసుకున్న గ్యాప్

'కొరియన్ కనకరాజు'తో భారీ హిట్

ఒకప్పుడు మీనా .. రంభ .. నగ్మా వంటి బొద్దుగా ఉన్న బ్యూటీలు తెలుగు తెరను ఒక ఊపు ఊపేశారు. స్టార్ హీరోలతో కలిసి వరుస విజయాలను అందుకుంటూ, తమ కెరియర్ ను పరుగులు తీయించారు. అలా కాస్త బొద్దుగా కనిపిస్తూ .. క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ తో ఈ మధ్య కాలంలో యూత్ ను ఆకట్టుకున్న బ్యూటీగా రితికా నాయక్ కనిపిస్తుంది. 'మిరాయ్' సినిమాలో ఈ సుందరిని చూసిన కుర్రాళ్లు, థియేటర్స్ దగ్గరే మనసులు పోగొట్టుకున్నారు. ఈ ముద్దుగుమ్మ నెలకో సినిమా చేస్తే బాగుండునే అనుకున్నారు. కానీ 'మిరాయ్' మాదిరిగానే తనకి బాగా నచ్చే కంటెంట్ కోసం రితికా ఎదురుచూస్తూ వచ్చిందనే విషయం, 'కొరియన్ కనకరాజు' రిలీజ్ తరువాతనే అర్థమవుతోంది. రీసెంటుగా విడుదలైన ఈ సినిమా, అనూహ్యమైన రెస్పాన్స్ ను అందుకుంది. కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్న వరుణ్ తేజ్ కి ఈ సినిమా ఫలితం ఊరటను ఇచ్చింది .. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ సినిమాలోను నటన పరంగా .. గ్లామర్ పరంగా రితికా మంచి మార్కులు కొట్టేసింది. అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుందని అనిపించింది. కొంత కాలంగా టాలీవుడ్ లో హీరోయిన్స్ వైపు నుంచి సందడి తగ్గిందనే చెప్పాలి. ఒకటి రెండు సినిమాలు చేసుకుపోతున్నారే తప్ప, నిలకడగా ఎవరూ సక్సెస్ లు సాధించలేకపోతున్నారు. టాప్ త్రీ .. టాప్ 5 అంటూ గతంలో మాదిరిగా ఒక జాబితా చూసుకుంటే, ఎవరూ కనిపించని ఒక గందరగోళం ఉంది. అలాంటి పరిస్థితుల్లో మరో భారీ హిట్ ను అందుకున్న రితికా, మరిన్ని అవకాశాలతో బిజీ అవుతుందేమో చూడాలి.





# ప్రళయ్.. ధురంధర్ తర్వాత రణ్‌వీర్ సింగ్ కొత్త ప్రాజెక్టు ఇదే..



## సెట్స్‌పైకి భారీ సర్వైవల్ థ్రిల్లర్

'ప్రళయ్' అనే కొత్త సినిమా షూటింగ్‌ను ప్రారంభించిన రణ్‌వీర్ సింగ్

ముంబై నేపథ్యంలో భారీ స్థాయిలో పోస్ట్-అపోకలిప్టిక్ సర్వైవల్ థ్రిల్లర్

'స్కామ్ 1992' ఫేమ్ జై మెహతా దర్శకత్వం, కీలక పాత్రలో కళ్యాణి ప్రియదర్శన్

సుమారు రూ.300 కోట్ల బడ్జెట్‌తో బిర్లా, హన్సల్ మెహతా, రణ్‌వీర్ సంయుక్త నిర్మాణం

'ధురంధర్' సిరీస్ బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత రణ్‌వీర్ నటిస్తున్న చిత్రం

భారత సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన 'ధురంధర్: ది రివెంజ్' తర్వాత బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణ్‌వీర్ సింగ్ తన తదుపరి భారీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. 'ప్రళయ్' పేరుతో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం షూటింగ్ ఆదివారం ముంబైలో ప్రారంభమైంది. పోస్ట్-అపోకలిప్టిక్ సర్వైవల్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణను ముంబై పరిసర ప్రాంతాల్లోని లైవ్ లొకేషన్లలో నిర్వహిస్తున్నారు. 'స్కామ్ 1992: ది హర్షద్ మెహతా స్టోరీ', 'లూటేరే' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన సిరీస్‌లకు దర్శకత్వం వహించిన జై మెహతా ఈ చిత్రానికి దర్శకుడు. ప్రముఖ దర్శకుడు హన్సల్ మెహతా కుమారుడైన జై, చాలాకాలంగా ఈ కథపై పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్‌కు జోడీగా కాకుండా, ఓ కీలక పాత్రలో 'లోకా' ఫేమ్, మలయాళ నటి కళ్యాణి ప్రియదర్శన్ నటిస్తున్నారు. కుప్పకూలుతున్న ప్రపంచంలో మనుగడ, ధైర్యం, విలువైన వాటి కోసం సాగే పోరాటమే ఈ చిత్ర కథాంశం. సుమారు రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. భారతదేశంలో ఇంత భారీ స్థాయిలో ఇలాంటి కథాంశంతో సినిమా రావడం ఇదే తొలిసారని దర్శకుడు హన్సల్ మెహతా పేర్కొన్నారు. రణ్‌వీర్ సింగ్ ఈ ప్రాజెక్ట్‌పై చూపిన ఆసక్తి, నిబద్ధత వల్లే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. ఈ చిత్రాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త అనన్య బిర్లాకు చెందిన బిర్లా స్టూడియోస్, హన్సల్ మెహతా-సాహిల్ సైగల్‌కు చెందిన ట్రూ స్టోరీ ఫిలింస్, రణ్‌వీర్ సింగ్ సొంత నిర్మాణ సంస్థ మా కసమ్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జై మెహతా, విశాల్ కపూర్ కలిసి రాసిన ఈ ఒరిజినల్ కథపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ ప్రారంభమైన ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ ఇంకా ప్రకటించలేదు.



# పవర్ స్టార్ 'OG2' పై బిగ్ అప్‌డేట్..

ఏర్పాట్లు పూర్తి కాగానే

రెగ్యులర్ అప్‌డేట్స్!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులకు పండుగలాంటి వార్త బయటకు వచ్చింది. టాలీవుడ్‌లో ఎంతోమంది ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'దే కాల్ హిమ్ 'OG' సీక్వెల్ ''OG 2'పై ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఇక పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్ట్ కోసం డేట్స్ కేటాయించినట్లు వార్తలు వస్తుండటంతో అభిమానుల ఆనందానికి అవధులు లేవు. ప్రాజెక్ట్‌కి సంబంధించిన కొన్ని ముఖ్యమైన పనులు పూర్తయిన వెంటనే వరుస అప్‌డేట్స్ ఇచ్చేందుకు చిత్రబృందం సమాయత్తమవుతోంది. ఆ విశేషాలు చూద్దాం.. ాశ్రీంశీ =ఘుం - రామ్ చరణ్ తర్వాత బుచ్చిబాబు కథ ఎవరికి? హీరోల లిస్ట్‌లో ఎవరెవరు ఉన్నారంటే? డేట్స్ ఇచ్చేసిన పవన్ కల్యాణ్: దర్శకుడు సుజీత్ రూపొందించిన ''OG' ప్రపంచంలో పవన్ కల్యాణ్ 'ఓజస్ గంభీర' అలియాస్ ''OG'గా చూపించిన స్టైల్, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు పార్ట్ 2 కోసం పవన్ కల్యాణ్ డేట్స్ కేటాయించారని తెలుస్తుండటంతో షూటింగ్ పనులు త్వరలోనే ఊపందుకోనున్నాయి. మేకర్స్ ప్రాథమిక ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. సెప్టెంబర్ 2న



బర్త్‌డే స్పెషల్ ప్రోమో?: ఇప్పటికే ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ''OG 2' కోసం ఒక ప్రత్యేకమైన యానిమేషన్ ప్రోమోను సిద్ధం చేయాలని చిత్రయూనిట్ ప్లాన్ చేస్తోంది. ఇక పవన్ కల్యాణ్ పుట్టినరోజైన సెప్టెంబర్ 2న ఈ స్పెషల్ ప్రోమోను విడుదల చేసే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించి కొన్ని కీలకమైన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇవి పూర్తి కాగానే అభిమానుల కోసం రెగ్యులర్ అప్‌డేట్స్ ఇవ్వడం ప్రారంభించాలని ప్రొడక్షన్ టీమ్ భావిస్తోంది. ఇక పవన్ క్యారెక్టరైజేషన్, యాక్షన్ ఎపిసోడ్స్ ఈ సీక్వెల్‌లో మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్లు టాక్. మరింత వినూత్నంగా సుజీత్ మేకింగ్: మొదటి భాగంలో పవన్ కల్యాణ్‌ను ఒక రేంజ్‌లో చూపించిన సుజీత్, ''OG 2'ని అంతకుమించి తీర్చిదిద్దేందుకు పక్కా స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఇక యాక్షన్, ఎమోషన్ కలగలిపి గ్లోబల్ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పవర్ స్టార్ అభిమానులకు ''OG 2' ఒక గ్రాండ్ విజువల్ ట్రీట్‌లా ఉండబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. పవన్ కల్యాణ్ గ్రాండ్ ఎంట్రీ, సుజీత్ విజన్ కలగలిసి థియేటర్లలో ఏ స్థాయి సంచలనం సృష్టిస్తాయో వేచి చూడాలి.

# 'స్పిరిట్' లో ప్రభాస్ ఇంట్రోపై భారీ హైప్.. వంగా కొత్త ప్లాన్ ఇదేనా?

: టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పాన్-ఇండియా స్థాయిలో హైప్ వున్నా మూవీస్ స్పిరిట్ కూడా ఒకటి. ఇందులో ప్రభాస్ ఒక శక్తివంతమైన పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఇందులో ఆయన పాత్రను ఎలా పరిచయం చేయబోతున్నారనే దానిపై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తూ, అభిమానుల్లో క్యూరియాసిటీని రెట్టింపు చేస్తోంది. సెంట్రల్ జైల్లో అసలైన విధ్వంసం: తాజా సమాచారం ప్రకారం, 'స్పిరిట్' సినిమా ఒక సెంట్రల్ జైలు వాతావరణంలో ప్రారంభమవుతుందట. జైల్లో ఉన్నట్టుండి పెద్ద గందరగోళం చెలరేగడం, నేరస్థులు నియంత్రణ కోల్పోవడం, అక్కడున్న పోలీసులు కూడా ఆ పరిస్థితిని అదుపు చేయలేక చేతులెత్తేయడం వంటి సన్నివేశంతో కథ మొదలవుతుంది. ఇక ఈ రచ్చ జరుగుతున్న సమయంలోనే ప్రభాస్ క్యారెక్టర్ ఎంట్రీకి వేదిక సిద్ధమవుతుందని తెలుస్తోంది. భయంతో వణికించే పేరు: అయితే ఈ సీన్‌లో ప్రభాస్‌ను వెంటనే చూపించకుండా, అక్కడి నేరస్థుల భయం ద్వారా ఆయన పవర్‌ను చూపిస్తారట. ఆ పోలీస్ ఆఫీసర్ పేరు వినగానే ఖైదీల ముఖాల్లో స్పష్టమైన భయం కనిపిస్తుందట. ఇక ఎటువంటి డిజైన్డ్ ఫైట్స్ లేదా భారీ డైలాగులు లేకుండా, కేవలం ఆయన పేరుతోనే ఆ పాత్ర ఎంత ప్రమాదకరమైనదో దర్శకుడు సందీప్ వంగా చాలా పవర్‌ఫుల్‌గా ఎస్టాబ్లిష్ చేయబోతున్నారట. పాత హిందీ పాటతో వినూత్నంగా ఇంట్రో: ప్రభాస్ ఎంట్రీ ఎంతో సైలెంట్‌గా, సైకోటిక్ రేంజ్‌లో ఉండబోతోందని టాక్. ఖాకీ యూనిఫామ్‌లో ఉన్న ప్రభాస్ చాలా ప్రశాంతంగా, పాత హిందీ పాటలు వింటూ కేజువల్‌గా జైల్లోకి అడుగుపెడతారట. ఇక చుట్టూ ఉన్న నేరస్థులు భయంతో వణుకుతుంటే, ప్రభాస్ మాత్రం క్లాసిక్ సాంగ్ వింటూ కూల్‌గా కనిపించే ఈ కాంట్రాస్ట్ షాట్ సినిమాలోనే అతిపెద్ద హైలైట్‌గా నిలుస్తుందని అంటున్నారు.







# సమంత మరో స్టార్ కి నో చెప్పిందా?

టాలీవుడ్ - కోలీవుడ్ పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచుకున్న స్టార్ హీరోయిన్ సమంత గురించి ప్రస్తుతం ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ వార్త చర్చనీయాంశమవుతోంది. అగ్ర నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న ఓ ప్రతిష్టాత్మక చిత్రంలో నటించే అవకాశాన్ని సామ్ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. టాలీవుడ్ కు చెందిన ఓ స్టార్ హీరో సరసన నటించాల్సిన ఈ భారీ ప్రాజెక్ట్‌కు సమంత నో చెప్పడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. హీరోల లిస్ట్‌లో ఎవరెవరు ఉన్నారంటే? విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్ట్ ఇప్పుడే పట్టాలెక్కేది కాదని, సరిగ్గా ఏడాది తర్వాత ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. సుదీర్ఘ కాలం పాటు సెట్స్‌లో ఉండాల్సిన ఈ ప్రాజెక్ట్ షెడ్యూల్స్ ... భవిష్యత్ ప్రణాళికలు తన ప్రస్తుత వ్యక్తిగత, వృత్తిపరమైన ఆలోచనలకు సరిపడకపోవడంతోనే సమంత ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ భారీ బడ్జెట్ చిత్రానికి సామ్ డేట్స్ కేటాయించలేనని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా సమంత సినిమాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ఆస్కారం ఉన్న బలమైన పాత్రలను మాత్రమే ఎంచుకుంటున్నారు. అలాగే సమంత ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యతనిస్తూ ప్రాజెక్ట్‌లను అంగీకరిస్తున్నారు. ఏడాది తర్వాత ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్ట్ కోసం ఇప్పుడే కమిట్ అయితే ఇతర ప్రణాళికలకు ఆటంకం ఏర్పడుతుందనే ఉద్దేశంతోనే సమంత ఈ ఆఫర్‌ను వదులుకుంటుంది అన్నది మరో వెర్షన్. మరోవైపు అగ్ర నిర్మాణ సంస్థ - స్టార్ హీరో సినిమా కావడంతో సమంత ఈ ఆఫర్‌ను తిరస్కరించడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. సాధారణంగా ఇలాంటి పెద్ద ప్రాజెక్ట్‌లను నటీనటులు వదులుకోవడానికి సాహసించరు. కానీ సమంత మాత్రం తాను తీసుకునే నిర్ణయాలపై ఎంతో స్పష్టతతో ఉంటానని మరోసారి నిరూపించారు. కథలో కొత్తదనం .. పాత్ర ప్రాధాన్యతను బట్టే అడుగులు వేస్తున్నారని ఈ ఘటన ద్వారా స్పష్టమవుతోంది. ప్రస్తుతం సమంత దృష్టిని వెబ్ సిరీస్‌లు, పాన్-ఇండియా ప్రాజెక్ట్‌లు , సొంత ప్రొడక్షన్ వెంచర్లపై ఎక్కువగా కేంద్రీకరిస్తున్నారు. సినిమాల ఎంపికలో సామ్ అనుసరిస్తున్న సెలెక్టివ్ అప్రోచ్ ఆమె కెరీర్‌ను మరింత భిన్నమైన మార్గంలో నడిపిస్తోంది. భారీ ఆఫర్లను సైతం వ్యక్తిగత ప్రాధాన్యతల కోసం పక్కన పెట్టే సమంత తెగింపు ఇండస్ట్రీలో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది.






# నాకు అండగా ఆ ఇద్దరు హీరోలు

తన కష్టకాలంలో ఇద్దరు హీరోలు అండగా నిలుస్తారన్న అనుపమ

బాధలో ఉన్నప్పుడు దుల్కర్ సల్మాన్ నుంచి మెసేజ్ వస్తుందని వెల్లడి

దుల్కర్ తర్వాత రామ్ పోతినేనిని ఎక్కువగా విశ్వసిస్తానని స్పష్టం

మాజీ ప్రియుడి నుంచి ఎదుర్కొన్న మానసిక వేధింపుల గురించి ప్రస్తావన



ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తన సినీ జీవితంలో తనకు అండగా నిలిచే ఇద్దరు హీరోల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, తాను మనసు బాగోలేనప్పుడు, కష్టకాలంలో ఉన్నప్పుడు తనను ఓదార్చే స్నేహితులు ఇండస్ట్రీలో ఉన్నారని తెలిపారు. వారిలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, టాలీవుడ్ హీరో రామ్ పోతినేని ఉన్నారని వెల్లడించారు. తాను బాధలో ఉన్నప్పుడు గుర్తుకొచ్చే మొదటి పేరు దుల్కర్ సల్మాన్‌దేనని అనుపమ అన్నారు. "నేను ఎప్పుడు డల్‌గా ఉన్నా, దుల్కర్ నుంచి నాకు ఒక మెసేజ్ వస్తుంది. నేను బాధలో ఉన్న విషయం ఆయనకు ఎలా తెలుస్తుందో అని ఆశ్చర్యపోతాను. ఆయనతో కాసేపు మాట్లాడితే నా బాధ అంతా మాయమైపోతుంది" అని ఆమె వివరించారు. దుల్కర్ తర్వాత, తాను ఎక్కువగా విశ్వసించే మరో వ్యక్తి టాలీవుడ్ హీరో రామ్ అని అనుపమ తెలిపారు. వీరిద్దరితో ఉన్న స్నేహబంధం తనకెంతో విలువైందని ఆమె పేర్కొన్నారు. గతంలో అనుపమ, దుల్కర్ కలిసి మలయాళ చిత్రం 'జోమోంటే సువిశేషంగళ్'లో నటించిన విషయం తెలిసిందే. ఇదే సందర్భంగా, తన గత ప్రేమ సంబంధంలో ఎదుర్కొన్న మానసిక వేధింపుల (నార్సిసిస్టిక్ అబ్యూజ్) గురించి కూడా ఆమె ప్రస్తావించారు. అలాంటి వ్యక్తులు ఇతరులను ఎప్పుడూ తమ నియంత్రణలో ఉంచుకోవాలని ప్రయత్నిస్తారని, ఇది చాలా నిశ్శబ్దంగా జరిగే వేధింపు అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001.
APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.